నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 24-4-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:202 పేజీలు:6 వెల: రూ.1/-

ఏపీలో ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌ల బదిలీ

అమరావతి, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏపీ ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ఇద్దరు సీనియర్ అధికారులపై బదిలీ వేటు వేసింది. ఇంటెలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులు, విజయవాడ సీపీ క్రాంతి రాణాను బదిలీ చేసింది.

మరక

ఎన్నికల్లో మతతత్వం
ఏగదోసుడు కాదా తప్పు
విద్వేషం ప్రచారంగా
వెదజల్లితే లేదా ముప్పు.

ఎన్నికల కమిషన్ కు
ఏది ఇది కనిపించదు
పవర్ పార్టీ కనుసన్నలో
పనిచేస్తే వినిపించదు

-వేల్పుల నారాయణ

కెసిఆర్ చేతిలో రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారు

-రూ.3900 కోట్ల లోటుతో రాష్ట్రాన్ని కెసిఆర్ తనకు అప్పగించారు
-కేసిఆర్ చేసిన అప్పులకు నాలుగు నెలల్లో రూ.26 వేల కోట్లు మిత్తీ కట్టాం
-మహిళల ఉచిత ప్రయాణానికి రూ.1300 కోట్లు ఆర్‌టిసి చెల్లించాము
-కొడంగల్ సెగ్మెంట్ మద్దూరులో కార్యకర్తలతో రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మారుమూల కొడంగల్‌కు కాంగ్రెస్ ముఖ్యమంత్రి పదవి ఇచ్చిందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కొడంగల్ నుంచే సిఎం వరకు తన ప్రస్థానం ఇక్కడే ప్రారంభమైందని, ఎవరికైనా ఇచ్చే స్థాయికి కొడంగల్‌ను కాంగ్రెస్ చేర్చిందన్నారు. కొడంగల్ సెగ్మెంట్ మద్దూరులో కార్యకర్తలతో సిఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. పాలమూరు నుంచి బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌ను ఎంపిగా గెలిపిస్తే ఫాం హౌస్‌లో పడుకున్నాడని, కెసిఆర్‌లా ఫాంహౌస్‌లో పడుకోకుండా ప్రజల్లోకి తాను పోతున్నానని స్పష్టం చేశారు. చెపినా ఒక్క మాటలను కెసిఆర్ నిలబెట్టుకోలేదని, రూ.3900 కోట్ల లోటుతో రాష్ట్రాన్ని కెసిఆర్ తనకు అప్పగించారని, కెసిఆర్ చేసిన అప్పులకు నాలుగు నెలల్లో రూ.26 వేల కోట్లు మిత్తీ కట్టామని, మహిళల ఉచిత ప్రయాణానికి రూ.1300 కోట్లు ఆర్‌టిసి చెల్లించామని, తాగుబోతు కెసిఆర్ చేతిలో రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని రేవంత్ ధ్వజమెత్తారు. పంద్రాగస్టు లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, తాను రుణమాఫీ చేస్తే కెసిఆర్, హరీష్ రావు బిఆర్‌ఎస్ పార్టీని రద్దు చేసు కుంటారా? అని సవాల్ విసిరారు. రైతులతో బ్యాంకు అధికారులు జాగ్రత్తగా ఉండాలని, రైతులను బ్యాంకర్లు ఇబ్బంది పెడితే తాము ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని బిఆర్‌ఎస్, బిజెపి వాళ్లు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మక్తల్ ఎత్తిపోతలకు ఆనాడు బిజెపి నేత డికె అరుణ అడ్డుకోవడంతో పాటు కృష్ణా జలాలు, రైల్వే లైన్ రాకుండా చేశారని విమర్శలు గుప్పించారు. మంత్రిగా ఉండి డికె అరుణ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదని, శత్రువు చేతిలో కత్తివై పాలమూరు కంట్లో పొడుస్తున్నావని అరుణకు చురకలంటించారు. పాలమూరు అభివృద్ధిని అడ్డుకునేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడు గుడిలో ఉండాలి, భక్తి గుండెల్లో ఉండాలి, గోడల మీద రాస్తే వీధుల్లోకి వస్తే అది భక్తి కాదని బిజెపి ఉద్దేశించి ఘాటు విమర్శలు చేశారు.

కవిత జ్యుడీషియల్ కస్టడీ మరో 14 రోజుల పాటు పొడిగింపు

న్యూ డిల్లీ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఢిల్లీ మద్యం కేసులో ఎంఎల్‌సి కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగించారు. కవిత జ్యుడీషియల్ కస్టడీ మరో 14 రోజుల పాటు పొడిగించారు. మే 7 వరకు కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఇదే ఢిల్లీ మద్యం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ కూడా మే 7వరకు పొడిగించింది. ఇడి కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై రౌస్ రెవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. ఇడి తరపున న్యాయవాది జోయబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. కవితకు బెయిల్ ఇవ్వొద్దని ఇడి తరుపు న్యాయవాది జోయబ్ పేర్కొన్నారు. కవిత అరెస్టు చట్టబద్ధంగానే జరిగిందని ఇడి తరుపు న్యాయవాది వివరించారు. సెక్షన్ 19 అనుగుణంగానే కవిత అరెస్టు జరిగిందని వెల్లడించారు.ఏప్రిల్ 11న కవితను సిబిఐ తీహార్ జైలు నుంచి అరెస్ట్ చేసింది. కోర్టు అనుమతితో మూడు రోజుల కస్టడీ తీసుకుని విచారించింది. ఆ తర్వాత కోర్టులో ప్రవేశపెట్టగా.. తొమ్మిది రోజుల పాటు కవితకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో ఆమెను మళ్లీ తీహార్ జైలుకు తరలించారు.

ప్రజల సంపద ఒక వర్గానికే పంపిణీ

-కాగ్రెస్ పాలనలో హనుమాన్ చాలీసా వినడం కూడా నేరమవుతుంది
- కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ ఆరోపణాస్త్రాలు

జైపూర్ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం మరోసారి కాంగ్రెస్‌పై ఆరోపణాస్త్రాలు కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మత విశ్వాసాలను కొనసాగించడం కష్టమని అంటూ ప్రజల సంపదను లాక్కుని ఒక వర్గానికి పంపిణీ చేయాలని ఆ పార్టీ కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. చేశారు. కాంగ్రెస్ పాటనలో మత విశ్వాసాలను పాటించడం కూడా ప్రజలకు కష్టంగా మారుతుందని మంగళవారం రాజస్థాన్‌లోని టోంక్‌లో ఒక ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ ఆయన ఆరోపించారు. కాగ్రెస్ పాలనలో హనుమాన్ చాలీసా వినడం కూడా నేరమవుతుందని ఆయన ఆరోపించారు. దేశం హనుమాన్ జయంతి జరుపుకుంటున్న రోజున మోడీ నుంచి ఈ ఆరోపణలు రావడం గమనార్హం. రాజస్థాన్‌లోని బన్సారాలో ఒక ఎన్నికల ప్రచార సభలో తాను ప్రసంగిస్తూ ప్రజల సంపదను పంపిణీ చేయడంపై చేసిన వ్యాఖ్యలను మోడీ ప్రస్తావిస్తూ తన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి తీవ్ర ఆగ్రహం చెంది ప్రతి చోట తనను దూషించడం ప్రారంభించాయని చెప్పారు. మీ సంపదను లాక్కుని ఒక ఎఐపిక చేసిన కొందరు వ్యక్తులకు పంపిణీ చేయాలన్న లోతైన కుట్రను కాంగ్రెస్ రచిస్తోందన్న వాస్తవాన్ని మాత్రమే తాను బయటపెట్టానని మోడీ తెలిపారు.రెండు మూడు రోజుల క్రితం తాను కాంగ్రెస్ పార్టీ చేసే ఓటు బ్యాంకు రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాల గురించి మా ట్లాడానని, ఇది కాంగ్రెస్‌కు, ఇండియా కూటమికి ఆగ్రహం తెప్పించి మోడీని తిట్టడం ప్రారంభించాయని ఆయన తెలిపారు. నిజం మాట్లాడితే కాంగ్రెస్ ఎందుకు భయపడి తన విధానాలను దాచిపెడుతోందని ఆయన ప్రశ్నించారు. దేశంలోని ప్రజల వద్ద ఉన్న సంపదపై సర్వే జరిపిస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో రాసిందని, సంపదపై ఎక్స్‌రే తీస్తామని ఆ పార్టీ నాయకుడే ప్రకటించాడని మోడీ తెలిపారు. మీ రహస్యాలు బట్టబయలు కావడంతో మీ రహస్య ఎజెండా బయటపడి వణుకుతున్నారని ఆయన కాంగ్రెస్‌ను ఎద్దేవా చేశారు.

సరైన జవాబు చెప్పాలి

- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

సంగారెడ్డి ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మోడీ, ఎన్‌డిఏ కూటమికి 400 సీట్లు కాదు 200 సీట్లు కూడా వచ్చేలా లేవని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి కూడా 100 నుంచి 150 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చేదెవరైనా మన వద్దకు రావాలంటే బిఆర్‌ఎస్‌కు మంచి సీట్లు రావాలన్నారు.

93 బిసి కులాల ను ఒక్కతాటి పైకి తెచ్చి నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ అని, బలహీన వర్గాలు గొంతుకై నిలబడ్డ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ అని పేర్కొన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి బిసిల సత్తా ఏంటో చూపాలని కోరారు. బిఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కు మద్దతుగా రాజేంద్ర నగర్ నియోజవ ర్గంలోని బుద్వేల్ లో నిర్వహించిన రోడ్ షో లో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రె సిడెంట్ కెటిఆర్ పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. బిఆర్‌ఎస్‌కు పది పన్నెండు సీట్లయినా ఉంటేనే తెలంగాణకు రక్షణ అని, పదవులు అనుభవించి తల్లిలాంటి పార్టీకి ద్రోహ ం చేసిన వాళ్లకు తగిన బుద్ధి చెప్పా లని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వదిలి వెళ్లిన వాళ్లకు కర్రు కాల్చి వాత పెట్టాలని, తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినోళ్లకు సరైన జవాబు చెప్పాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో రంజిత్ రెడ్డి, మహేందర్ రెడ్డికి గుణపాఠం చెప్పాలని, ఓడిపోగానే పారిపోయిన పిరికిం దలకు బుద్ధి చెప్పాలని కెటిఆర్ పిలుపునిచ్చారు.కాంగ్రెస్ వాళ్లను రెండు లక్షల రుణమాఫీ ఎప్పుడు అని అడిగాలని, ఇప్పుడు కొత్తగా ఆగస్టు 15 అంటున్నారని, మనం మళ్లీ నమ్ముదా మా, మహిళలందరికీ రూ.2500 ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మూడవ స్థానానికే పరిమిత మౌతుందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత గ్యారంటీలను ప్రజల్లో ఎండగటాలన్నారు. రైతు బంధు రూ.15 వేలు ఏమైంది, రూ.2 లక్షల రుణమాఫీ ఏమైంది, రూ.4 వేల పెన్షన్ ఏమైంది, అడబిడ్డలకు నెల కు రూ.2500 ఏమైందని ప్రశ్నించా రు. కల్యాణ లక్ష్మికి తోడు తులం బంగారం ఇస్తామన్నారని, ఇప్పటివర కు ఒక్కరికి కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మోసపోయారని, మరోసారి మోసం చేయడానికి సిఎం రేవంత్ రెడ్డి వస్తున్నారని జాగ్రత్తగా చూసి ఓటు వేయాలని కెటిఆర్ కోరారు.

పదేళ్లలో క్రూడ్ ఆయిల్ ధర తగ్గిందని, కానీ పెట్రోల్ ధర రూ.110 మాత్రం అలానే ఉందని, క్రూడ్ ఆయిల్ ధర తగ్గితే పెట్రోల్ ధర తగ్గదా? అని విమర్శించారు. బిజెపి వాళ్లు అధికారంలో ఉండి చేసింది ఏంటంటే జైశ్రీరామ్ అన్నారని, జైశ్రీరామ్ బిజెపి ఎంఎల్‌ఎ కాదని అని, అందరివాడు అని చెప్పారు. శ్రీరాముడిని మొక్కుదామని, తెలంగాణకు ఒక్క రూపాయి ఇవ్వని బిజెపి తొక్కుదామని పిలుపునిచ్చారు. కృష్ణావాటర్‌లో మన వాటా తేల్చమని కెసిఆర్ అంటే కేంద్రం స్పందించలేదని, కెసిఆర్ మళ్లీ ఢిల్లీని ఆటాడించే రోజు తొందరలోనే ఉందన్నారు. కెటిఆర్ రోడ్ షోలో పెద్ద ఎత్తున్న గులాబీ శ్రేణులు, ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు

నేను పెరగాల్సిన ఎత్తుకు పెరిగాను.. ఎవరూ తగ్గించలేరు.. కాంగ్రెస్ నాయకులపై కేసీఆర్ సెటైర్

హైదరాబాద్, ఏప్రిల్ 23: తెలంగాణలో ప్రస్తుతం నడుస్తున్నది దేవుడి మీద ఒట్లు.. కేసీఆర్ మీద తిట్లు అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి, ఇతరులు వాగ్దానాలు నెరవేర్చలేక.. పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి తప్పదని ఇలా తమ ఫ్రస్టేషన్‌ను చూపిస్తున్నాయని అన్నారు. మరోవైపు కాంగ్రెస్ సభలు అన్నీ అట్టర్‌ప్లాఫ్ అవుతున్నాయని పేర్కొన్నారు. ఓ మీడియా ఛానల్‌లో బిగ్ డిబేట్‌లో పాల్గొన్న కేసీఆర్.. కాంగ్రెస్, బీజేపీది రాజకీయ వికృత క్రీడ అని విమర్శించారు. కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చిందని.. ప్రజలు మోసపోయి కాంగ్రెస్‌ను గెలిపించారని తెలిపారు. కేసీఆర్ హిస్టరీ ఆఫ్ తెలంగాణ అని చెప్పారు. కేసీఆర్‌ను తగ్గించాలని చాలామంది ప్రయత్నాలు చేసి భంగపడ్డారని అన్నారు. నేను పెరగాల్సిన ఎత్తు పెరిగాను.. నన్ను తగ్గించడమనేది ఉండదు. ఇది కాంగ్రెస్, బీజేపీ చిలిపి రాజకీయ క్రీడ అని ఆయన పేర్కొన్నారు.

అజ్ఞానం, అహంకారపూరితంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని కేసీఆర్ అన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని ముఖ్యమంత్రి శాసనసభలో అన్నారని గుర్తు చేశారు. ఆ ఆలోచన ఎంతటి వికృతమైందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ 10 ఏండ్లు అధికారంలో లేదు.. ఆ పార్టీ పోయిందా? అని ప్రశ్నించారు. ఎవరి టైమ్ కోసం వాళ్లు వెయిట్ చేస్తుంటారు. కచ్చితంగా వాళ్ల టర్న్ వస్తుంది. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడు. వాళ్ల ఆలోచన సరళి మారుతుంది. కృతిమంగా చేసే ఆరోపణలు, ఇటువంటి ప్రయత్నాలు బెడిసికొడతాయని అన్నారు. ఇలాంటివి ఎప్పుడు చరిత్రలో ఎప్పుడు సక్సెస్ కాలేదని.. ఇప్పుడు కూడా కావని అన్నారు.

'రాజకీయాల్లో కొన్ని సందర్భాలు ఉంటాయి. విలీనం చేస్తామని చెప్పిన మాట వాస్తవం.. నేను చెప్పిన మాట వాళ్లు వినలేదు వాస్తవం. జూన్ 2వ తేదీన అపాయింట్మెంట్ డే పెట్టారు. రెండు రాష్ట్రాలు అయిపోయిన తర్వాత కంబైన్డ్ స్టేట్‌లో ఎన్నికలు పెట్టడం కరెక్ట్ కాదు.. ఇది తలాతోక లేని వ్యవహారం అని చెప్పా. కానీవాళ్లు వినలేదు. తదనంతరం నేను విలీనం చేయడానికి ఒప్పుకోలేదు. ఇండి పెండెంట్‌గా పోటీ చేసి గెలిచాం..అధికారంలోకి వచ్చాం.. ఇప్పుడు వాళ్లు అధికారంలోకి వచ్చారని అన్నారు.' అని అన్నారు.

ఈ నెల 26న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ రాష్ట్రానికి రాక

-అధికారులతో సీఎస్ సమన్వయ సమావేశం

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్)::: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈ నెల 26న రాష్ట్రానికి వస్తున్నందున తగిన విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉపరాష్ట్రపతి పర్యటనకు సంబంధించి సిఎస్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి బ్లూ బుక్ ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్, బందోబస్త్ చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఈ పర్యటనలో సరిపడా వైద్య సిబ్బందితో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆరోగ్య శాఖను కోరారు. భారత ఉపరాష్ట్రపతి ప్రయాణించే దారిలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఖీఉ శాఖకు సూచించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అదే విధంగా అగ్నిమాపక శాఖ తగిన అగ్నిమాపక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. డీజీపీ రవిగుప్తా, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, గవర్నర్ కార్యదర్శి బి వెంకటేశం, ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషారఫ్ అలీ ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నేటి నుండి వేసవి సెలవులు

-జూన్ 12వ తేదీన పాఠశాలలు పు నః ప్రారంభం

హైదరాబాద్ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వేసవి సెలవుల కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చేస్తో న్న విద్యార్థులకు శుభవార్త. బుధవారం ఆ నుంచి వేసవి సెలవులు ప్రారంభం కా నున్నాయి. రాష్ట్రంలో ఏప్రిల్ 24 నుంచి వే సవి సెలవులు ప్రారంభం కానున్నాయి. జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు కొనసాగుతాయని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. 2024- 25 విద్యా సంవత్సరానికి గానూ జూన్ 12వ తేదీన పాఠశాలలు పు నః ప్రారంభం కానున్నాయి. 1 నుంచి 9వ తరగతి వరకు మంగళవారం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేసి, తల్లిదండ్రుల తో సమావేశం నిర్వహించనున్నారు. రోజురోజుకూ పెరుగుతోన్న ఉష్ణోగ్రతల నేపథ్యం లో ప్రస్తుతం ?ల ఒంటిపూట బడులు కొనసాగుతున్నాయి.మార్చి 15 నుంచి ఒంటి పూట బడులు మొదలు కాగా, మంగళవారం తో ముగియనున్నాయి. ఏడాది పాటు పు స్తకాలు, పరీక్షలతోకుస్తీ పట్టిన విద్యార్థులు.. వేసవి సెలవుల్లో హాయిగా ఎంజాయ్ చేసేందుకు రెడీ అవుతున్నారు. వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. పెద్దలే ఆ వేడిని తట్టుకోలేకపోతున్నారు..

నేటి కందం- నేటికీ అందం

వంచన యనున దెరుంగక
మంచిని యందించునట్టి మహిత వ్యవస్థన్
పంచాయతిని దలంచుచు
నంచితముగ గొలువవలయు నభిమానముతోన్

(ఏప్రియల్ 24 పంచాయతీరాజ్య దినోత్సవం)

-రాధశ్రీ
సెల్:9494481210

ఆహ్వానము

అచ్చంగా ఐదు పుస్తకాల ఆవిష్కరణ సభ

శనివారం 27 ఏప్రిల్ 2024
వేదిక : స్పైసీహబ్ హోటల్, కొత్తపేట, హైదరాబాద్.

మొదటి సెషన్
ఉదయం 10.00 - 11.30 వరకు
" చిత్రకళా తపస్వి డా. కొండపల్లి శేషగిరిరావు కీ జీవన్ గాథా"
హిందీ అనువాద గ్రంథం ఆవిష్కరణ కార్యక్రమం
స్వాగత వచనాలు
మాడిశెట్టి గోపాల్, కవి
సభాధ్యక్షులు
డాక్టర్ ఓలేటి పార్వతీశం
దూరదర్శన్ విశ్రాంత సంచాలకులు
ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త
ఆచార్య ఎస్ .గోపి
కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత,పూర్వ ఉపకులపతి,తెలుగు విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథి
నరేంద్రరాయ్
ప్రముఖ చిత్రకారులు
ఆత్మీయ అతిథి
వారాల ఆనంద్
కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత
గ్రంథ అనువాద రచయిత
డాక్టర్ మరింగంటి లక్ష్మణాచార్యులు
కవి, రచయిత, అనువాదకులు
మూల రచయిత
డాక్టర్ కాండేపల్లి నీహారిణి
కవయిత్రి, రచయిత్రి, సాహిత్య విమర్శకురాలు
స్పందన కొండపల్లి వేణుగోపాల్ రావు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్
వందన సమర్పణ ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, కవి

రెండవ సెషన్
మధ్యాహ్నం 11.30 - 1.00 గంటల వరకు
డాక్టర్ కొండపల్లి నీహారిణి రచించిన
"అనివార్యం"
స్త్రీవాద సాహిత్య విమర్శ వ్యాస సంపుటి పుస్తక ఆవిష్కరణ
స్వాగత వచనాలు
కె ఎస్ అనంతాచార్యులు, కవి
సభాధ్యక్షులు
డాక్టర్ సూర్య ధనంజయ్
సీనియర్ ప్రొఫెసర్, తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆవిష్కర్త
డాక్టర్ ముదిగంటి సుజాత రెడ్డి
రచయిత్రి, తెలంగాణ సారస్వత పరిషత్ ఉపాధ్యక్షులు
ముఖ్య అతిథి
ఆచార్య కొలకలూరి ఇనాక్
పద్మశ్రీ అవార్డు గ్రహీత, పూర్వ ఉపకులపతి, ఎస్వీ యూనివర్సిటీ
విశిష్ట అతిథి
ఆచార్య మసన చెన్నప్ప
కవి, విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథులు
డాక్టర్ గండ్ర లక్ష్మణ రావు
కవి, రచయిత
జ్వలిత
కవయిత్రి, బహుళ అంతర్జాల పత్రిక సంపాదకులు
అన్నవరం దేవేందర్
కవి, రచయిత
వందన సమర్పణ
చెన్నోజ్వల పద్మశ్రీ, కవయిత్రి

మధ్యాహ్నం 1 .00 - 1.30 భోజన విరామం

మూడవ సెషన్
మధ్యాహ్నం 1.30 - 3.00 గంటల వరకు
"కథా మీరయూఖం", "బాల కథా మీరయూఖం"
మయూఖ అంతర్జాల పత్రిక కథా సంకలనాల ఆవిష్కరణ
స్వాగత వచనాలు
మాడిశెట్టి గోపాల్, కవి
సభాధ్యక్షులు
నెల్లుట్ల రమాదేవి, కవయిత్రి, రచయిత్రి, కార్టూనిస్ట్
ఆవిష్కర్త
డాక్టర్ అమృతలత
రచయిత్రి, విజయ్ విద్యాసంస్థల అధినేత
ముఖ్య అతిథి
బైస దేవదాస్, నేటి నిజం పత్రికాధిపతి, సంపాదకులు
విశిష్ట అతిథి
డాక్టర్ సి. మృణాళిని
రచయిత్రి , తెలుగు విశ్వవిద్యాలయం సిలికానాంధ్ర ఆచార్యులు
గౌరవ అతిథులు
డాక్టర్ చిల్లర భవానీ దేవి
కవయిత్రి,రచయిత్రి
వేదాంత సూరి
'మొలక' పత్రిక సంపాదకులు
డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ
కవి, రచయిత, సినీ గేయ రచయిత
ఆత్మీయ అతిథి
డాక్టర్ రూప్ కుమార్ దబ్బీకార్
కవి, రచయిత, విమర్శకులు, పాలపిట్టపత్రిక సహ సంపాదకులు
స్పందన
డాక్టర్ కొండపల్లి నీహారిణి, ' మయూఖ","తరుణి " పత్రిక సంపాదకులు
వందన సమర్పణ నరేష్ చారి , కవి

నాలుగవ సెషన్
మధ్యాహ్నం 3.00 నుండి 4.30 వరకు
" బుగిలేవి గురుతులే"
ధూళిపాళ అరుణ రచించిన కథా సంపుటి ఆవిష్కరణ
స్వాగత వచనాలు కె.ఎస్ అనంతాచార్య, కవి
సభాధ్యక్షులు నెల్లుట్ల రమాదేవి
కవయిత్రి, రచయిత్రి, కార్టూనిస్ట్
ముఖ్య అతిథి, పుస్తకావిష్కర్త
డాక్టర్ నందిని సిధారెడ్డి
కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు
కృతి స్వీకర్త
శ్రీ ఒద్దిరాజు మురళీధరరావు రచయిత, అనువాదకులు, లెక్చరర్ (ర)
విశిష్ట అతిథి
విహారి, కవి, రచయిత, సాహిత్య విమర్శకులు
గౌరవ అతిథి
డాక్టర్ నాళేశ్వరం శంకరం
కవి, రచయిత, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు
ఆత్మీయ అతిథులు
కందుకూరి శ్రీరాములు
కవి, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ అధ్యక్షులు
బెల్లం కొండ సంపత్
కవి, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ కార్యదర్శి
డాక్టర్ కొండపల్లి నీహారిణి
కవయిత్రి, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ ఉపాధ్యక్షురాలు
వందన సమర్పణ నక్క హరికృష్ణ, కవి

గ్రామీణ ఆర్థిక పరిపుష్టి దిశగా పంచాయతీ రాజ్ పథకాలు?!

(24 ఏప్రిల్ "జాతీయ పంచాయతీ రాజ్ దినం" సందర్భంగా)

24 ఏప్రిల్‌న దేశవ్యాప్తంగా పంచాయతీ రాజ్ వ్యవస్థలు 'జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించుకోవడానికి కేంద్ర, రాష్ట్ర పంచాయతీ మంత్రిత్వ శాఖలు ఏర్పాట్లు పూర్తి చేరాయి. ఈ రోజున నీటి సమృద్ధ పంచాయతీలు, పారిశుధ్య గ్రామాలు, నీటి సంరక్షణ పల్లెలు, స్కూల్ డ్రాపవుట్స్ లేని ఊళ్లు, సుస్థిరాభివృద్ధి పథకాల అమలు, స్వయంపాలనకు పట్టం కట్టే ఆవాసాలు లాంటి అంశాలతో పాటు 'క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీలు' అంశాన్ని కూడా పెద్ద ఎత్తున చర్చించనున్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినం-2024 సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పలు ఆవార్డులను రాష్ట్ర పంచాయతీలకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్నది.

భారత పంచాయితీ రాజ్ వ్యవస్థ పితామహుడు:

భారత పంచాయితీ రాజ్ వ్యవస్థ పితామహుడిగా 'బల్వంత్ లాయ్ మెహతా'ను పిలుస్తారు. దేశ పంచాయితీ రాజ్ వ్యవస్థలో గ్రామ స్థాయి పంచాయితీలు, బ్లాక్ స్థాయి పంచాయితీలు, జిల్లా పంచాయితీలనే మూడంచెల (త్రీ టయర్) వ్యవస్థలు పటిష్ట యంత్రాంగాలతో సేవలు ఉన్నాయి. స్థానిక సంస్థల్లో ముఖ్యమైనవిగా పేరొందిన పంచాయతీలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు, అనుభవజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

జాతీయ పంచాయతీ రాజ్ వ్యవస్థ చరిత్ర:

1959లో నాటి ప్రధానమంత్రి నెహ్రూ నేతృత్వంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ రాజస్థాన్‌లో తెలిసారి ప్రారంభమైంది. 73వ రాజ్యాంగ సవరణ, 1992 చట్టం చేయబడింది. దీనిని ఆధారంగా చేసుకొని 24 ఏప్రిల్ 1993న దేశ పంచాయతీ రాజ్ వ్యవస్థకు చేసిన సవరణకు గుర్తుగా 2010 నుంచి ప్రతి ఏట 24 ఏప్రిల్‌న 'జాతీయ పంచాయతీ రాజ్ దినం' నిర్వహించుట ఆనవాయితీ అయ్యింది.

నేడు దేశవ్యాప్తంగా 2.51 లక్షల పంచాయితీలు ఉండగా, అందులో 2.39 లక్షల గ్రామ పంచాయితీలు, 6904 బ్లాక్ పంచాయితీలు, 589 జిల్లా పంచాయితీలు సామాన్యులకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా పని చేస్తూ ప్రభుత్వ అభివృద్ధి పథకాలను అమలు చేయడంలో నిమగ్నమయ్యాయి. ఈ వ్యవస్థలు సమర్థవంతంగా పని చేయడానికి 29 లక్షలకు పైగా పంచాయితీ ప్రతినిధులు/ఉద్యోగులు సమగ్రాభివృద్ధి దిశగా అమూల్య సేవలను అందిస్తున్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీ లక్షణాలు:

ఆరోగ్యకర పంచాయతీ (హెల్దీ పంచాయత్స్)గా నిర్ణయించడానికి ప్రజలకు వైద్య ఆరోగ్య పరీక్షలు, 100 శాతం టీకాల ఏర్పాటు, ఆసుపత్రి ప్రసవాలు, పిల్లలకు/గర్భిణి స్త్రీలకు పోషకాహారం, సరిపోయేంతగా కుళాయిల ద్వారా సురక్షిత తాగు నీటి లభ్యత, పరిసరాల పరిశుభ్రత, భూగర్భ జలాల పరిరక్షణ చర్యలు, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, బహిరంగ మళమూత్ర విసర్జన రహిత కుటుంబాల నిర్మాణం, ఘన ద్రవ వ్యర్థాల నియంత్రణ, తరగని పునరుత్పాదక ఇంధనాల వినియోగం, హరిత సంపదతో నిండిన పంచాయతీలు, జీవవైవిధ్య పరిరక్షణ చర్యలు, ప్రభుత్వ నిధులు/పథకాల సద్వినియోగం, విద్యాలయాల పని తీరు సమీక్ష, మౌళిక వసతుల కల్పన లాంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

తెలంగాణకు పంచాయితీ అవార్డుల పంట:

కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ ప్రకటించిన 27 వివిధ గ్రామ పంచాయతీ ఆవార్డుల్లో తెలంగాణకు 8, కేరళకు 4, జె డ కెకు 3, మహారాష్ట్రకు 3 ఉత్తమ పురస్కారాలు ప్రకటించారు. స్థానిక సుస్థిరాభివృద్ధికి సంబంధించిన 09 విభాగాల్లో 113 పారామీటర్లను పరిగణనలోకి తీసుకొని పంచాయితీ అవార్డులు నిర్ణయిస్తారు.

తెలంగాణలోని ఆరోగ్యకర (హెల్దీ) పంచాయతీగా గౌతంపూర్ (భద్రాద్రి కొత్తగూడెం), నీటి వసతి కలిగిన పంచాయతీగా నెల్లుట్ల(జనగామ), సామాజిక భద్రతకు కొంగట్‌పల్లి(మహబూబ్‌నగర్), మహిళా పక్షపాత పంచాయితీగా ఐపూర్ (సూర్యపేట), మందొడ్డి (జోగులాంబ గద్వాల్) పంచాయితీకి పేదరిక నిర్మూలన/జీవనోపాధి కల్పన, చీవులదారి (వికారాబాదు) పంచాయితీకి సుపరిపాలన విభాగాల్లో బహుమతులను గెలుచుకున్నాయి. వీటితో పాటు సుల్తాన్‌పూర్(పెద్దపల్లి), గంభీరావుపేట (రాజన్న సిరిసిల్ల) పంచాయితీలు కూడా క్లీన్ అండ్ గ్రీన్, మౌళిక వసతుల స్వయం కల్పన విభాగాల్లో వరుసగా 2, 3వ స్థానాల్లో నిలిచాయి. ఈ విధంగా వివిధ ర్యాంకుల్లో తెలంగాణకు మొత్తం 19 అవార్డులు ప్రకటించబడడం గర్వకారణంగా ఉంది.

పంచాయితీల ప్రధాన బాధ్యతలు:

అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ సేవల అందుబాటు, స్థానిక ప్రజాస్వామిక పాలన, స్థానిక సేవల విస్తరణ, అన్ని వర్గాలకు/ప్రాంతాలకు సమానంగా అభివృద్ధి ఫలాలను అందించడం, గ్రామీణ ఆర్థికాభివృద్ధి, సాధికారత, పని కల్పన, తమ సమస్యలకు తామే పరిష్కారాలు వెతుక్కోవడం, నిధుల వినియోగంలో స్థానికుల పాత్ర, సామాజిక సమన్యాయ సాధన, పర్యావరణ పరిరక్షణ, జవాబుదారీతనం, పారదర్శక పాలన, మహిళా/బాలల పక్షపాత పథకాల అమలు లాంటి ముఖ్య లక్షణాలు కలిగిన గ్రామీణ పంచాయతీ వ్యవస్థలు దేశాభివృద్ధిలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయి.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

ఐదేళ్లుగా సాగుతున్న దమనకాండకు ఇక చరమగీతం - పవన్ కల్యాణ్

అమరావతి, ఏప్రిల్ 23: ఐదేళ్లుగా రాష్ట్రంలో సాగుతున్న ప్రభుత్వ దమనకాండకు చరమగీతం పలికే సమయం ఆసన్నమైంది? ఈ ఎన్నికలు రాష్ట్రానికే కాదు భవిష్యత్ తరాలకు ఎంతో కీలకమైనవి. అందుకోసం టీడీపీ, బీజేపీతో కలసి ఎన్డీఏ భాగస్వామ్య పక్షంగా ముందుకు వెళ్తున్నామని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. 60 నుంచి 70 వేల మంది ప్రజల ఆశీర్వచనాలతో వచ్చి ఈ రోజు పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేసినట్టు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో పిఠాపురం ఎంపీడీఓ కార్యాలయంలో పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ తరఫున పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి రామసుందర రెడ్డికి అందజేసి ప్రమాణం చేశారు.

అనంతరం పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. జనసేన పార్టీ మిగిలిన పార్టీలతో సమంగా బలం పుంజుకున్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగాలు చేసి ముందుకు వెళ్లాం. మండపేట, రామచంద్రపురం, పెద్దాపురం లాంటి 40 నియోజకవర్గాల్లో బలమైన ప్రజా నాయకులు పార్టీలో ఉన్నప్పటికీ పోటీ నుంచి విరమించుకోవాల్సి వచ్చింది. పిఠాపురంలోనూ బలమైన నాయకులు, ప్రజా సమస్యల మీద అవగాహన ఉన్న నాయకులు వర్మ తన కోసం సీటు త్యాగం చేశారన్నారు. ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ త్యాగం రాష్ట్ర ప్రయోజనాల కోసమే. వారికి భవిష్యత్తులో ఉన్నత స్థానం లభించాలని కోరుకుంటూ దానికి తన వంతు కృషి ఉంటుందని తెలియజేస్తున్నానన్నారు. కాకినాడ పార్లమెంటు అభ్యర్థిగా టీ ట్వెమ్ వ్యవస్థాపకులు ఉదయ్ శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు ఎంపీగా ఎన్నికైతే మన ప్రాంతంలో ఉపాధి అవకాశాల కోసం, ఓఎన్జీసీ కాలుష్యం తదితర అంశాలపై బలంగా గళం విప్పగలరన్నారు. ఇక్కడ తమకు మద్దతు ఇచ్చిన బీజేపీ నాయకులు బుర్రా కృష్ణంరాజు కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఎన్డీఏ కూటమి అఖండ విజయం సాధించబోతోంది. దానికి నేటి నామినేషన్ కి మద్దతుగా తరలివచ్చిన ఆశేష ప్రజానీకమే తార్కాణమన్నారు.

వైసీపీ సర్కార్ చేతిలో మీడియా నలిగిపోయింది..

నెల మొదటి తేదీన సామాజిక పింఛన్లు ఇళ్లకు తీసుకువెళ్లి ఇవ్వకపోతే దాని వెనుక ప్రభుత్వ కుట్ర ఉన్నట్టే. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ప్రభుత్వ అధికారులు అడ్డంకులు కలిగించకపోతే ఫించన్ ఇంటికే చేరుతుంది. ఈ ప్రభుత్వం చేతిలో నలిగిపోయిన మీడియాకి తాము అండగా ఉంటామన్నారు. మీ కష్టాల్లో పాలు పంచుకుంటాం.. గతంలో ముక్కోణపు పోటీ ఉంది.. ఇప్పుడు ఉమ్మడిగా ముందుకు వెళ్లడం వల్ల సమస్యలపై మరింత బలమైన పోరాటానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు, పిఠాపురం టీడీపీ ఇంఛార్జ్ ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ, బీజేపీ ఇంఛార్జ్ బుర్రా కృష్ణంరాజు, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పార్టీ లీగల్ సెల్ ఛైర్మన్ ఇవన సాంబశివప్రతాప్, పార్టీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వైసీపీకి గుడ్ బై!

అమరావతి, ఏప్రిల్ 23: ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపికి భారీ షాక్ తగిలింది. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వెంట్టుకూరు చిరంజీవి రెడ్డి మంగళవారం తన పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. మంగళగిరి కొండపనేని టౌన్ షిప్ లో ఎన్నికల ప్రచారంలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా లోకేష్ పసుపుకండువా కప్పి చిరంజీవిరెడ్డి, ఆయన అనుచరులను పార్టీలోకి ఆహ్వానించారు.

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విధానాలు నచ్చక తాను తన పదవికి రాజీనామా చేసినట్లు చిరంజీవిరెడ్డి చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర భవిష్యత్తు బాగుండటమేగాక పోలీసుల సంక్షేమానికి కృషిచేస్తారని నమ్మి తాము తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. నారా లోకేష్ మాట్లాడుతూ? జగన్ అధికారంలోకి వచ్చాక పోలీసు సోదరులు కూడా అన్నివిధాలా నష్టపోయారని తెలిఎారు. కొందరు ఉన్నతస్థాయి పోలీసు అధికారులు మాత్రం తమ వ్యక్తిగత స్వార్థం కోసం వ్యవస్థను పణంగా పెట్టి జగన్ కు కొమ్ముకాస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చాకబకాయిలన్నీ చెల్లిస్తామని అన్నారు. ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ పోస్టులను భర్తీచేసి పోలీసులపై పనిభారం తగ్గిస్తామని తెలిపారు.

అడబిడ్డలకు పుట్టినిల్లు తెలుగు దేశం పార్టీ

– ఐదేళ్లలో మహిళలపై దాడులు విపరీతంగా పెరిగాయి

– బొండపల్లిలో మహిళలతో చంద్రబాబు ముఖాముఖి

అమరావతి ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అప్పు చేసి పప్పుకూడు పెట్టేవాడు కావాలా? మంచి చేసే వాడు కావాలా? అని మహిళలను టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. సంపాదించి సంక్షేమ కార్యక్రమాలతో మీ ఆదాయాన్ని పెంచే పార్టీ కావాలా? అని అడిగారు. బొండపల్లిలో మహిళలతో చంద్రబాబు ముఖాముఖి మాట్లాడారు. ఎన్నికలు రాగానే మోసగాళ్లు వస్తారని, రకరకాల మాటలు చెబుతారని విమర్శలు గుప్పించారు. చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వకుండా అప్పు కింద ఇచ్చే వ్యక్తి జగన్ అని, ఆడబిడ్డలకు పుట్టినిల్లు తెలుగు దేశం పార్టీ అని, డ్వాక్రా సంఘాలకు ఆర్థిక సాయం చేశామని, తాము వడ్డీ లేని రుణాలు ఇప్పించామని, తాము ఇచ్చిన వడ్డీ లేని రుణాలు ఇవాళ ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఉద్యోగాలు లేక యువత రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని, కొంత మంది గంజాయి మత్తులో ఏం చేస్తున్నారో తెలియడం లేదని, ఐదేళ్లలో మహిళలపై దాడులు విపరీతంగా పెరిగాయని, మహిళల అదృశ్యమైన కేసులు కూడా పెరిగాయని, మహిళలకు న్యాయం చేసే పార్టీ తెలుగుదేశం పార్టీ అని చంద్రబాబు చెప్పారు.వైఎస్ఆర్‌సిపి పాలనలో తీవ్రంగా నష్టపోయిన మహిళలు చంద్రబాబు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్‌సిపికి చెందిన నేత తన భూమిని లాక్కున్నారని ఓ మహిళ కన్నీంటిపర్యంతమయ్యారు. రికార్డులు తారుమారు చేసి భూమి కబ్జా చేశారని ఓ మహిళ గోడు వెల్లబోసుకుంది. తన తండ్రి పెన్షన్ తొలగించి ఇబ్బందులు పెడుతున్నారని ఓ యువతి ఆవేదన వ్యక్తం చేసింది. అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కారం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

అట్టహాసంగా పవన్ నామినేషన్

–వేలాదిగా కదిలిన జనసైన్యం

–తండోపతండాలుగా తరలివచ్చిన కార్యకర్తలు

–టీడీపీ, బీజేపీ నేతల హాజరు

–కారుపై అభివాదం చేస్తూ పవన్ చిరునవ్వులు

అమరావతి, ఏప్రిల్ 23: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగాజనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. చేబ్రోలులోని నివాసంలో ముందుగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, తన కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తరువాత అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్ లో బయల్దేరి వెళ్లిన ఆయన.. రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను సమర్పించారు.

నామినేషన్ సందర్భంగా జనసేన కార్యకర్తలు, నేతలు భారీ ర్యాలీ తీశారు. అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. జై జైనసేన, జైజై పవన్ కల్యాణ్ అంటూ భారీగా నినాదాలు చేశారు. ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తూ పవన్ కల్యాణ్ ముందుకు సాగారు. ఈ ర్యాలీలో 30 వేల మంది పైగా జనసైనికులు పాల్గొన్నారని అంచనా. చేబ్రోలులోని పవన్ కళ్యాణ్ బస చేసిన ఇంటికి సోమవారం ఉదయం నుంచే పిఠాపురం నలుమూల నుంచి జనసైనికులు తండోపతండాలుగా తరలివచ్చారు. టీడీపీ, బీజేపీ నేతలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. టీడీపీ నేత వర్మ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఎపి, తెలంగాణలో నామినేషన్ల జోరు..

హైదరాబాద్, ఏప్రిల్ 23: ఎపి తెలంగాణలలో నామినేషన్ల సందడి కొనసాగుతోంది. ప్రధాన పార్టీల తరఫున అభ్యర్థులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు (ఆర్వో) సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీల్లో ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో కోలాహలం నెలకొంది.

ఏపీలో పిఠాపురం జనసేన అభ్యర్థిగా ఆ పార్టీ అధినేత పవన ల్యాణ్, గుడివాడ అసెంబ్లీ టిడిపి అభ్యర్థిగా వెనిగండ్ల రాము నామినేషన్ దాఖలు చేశారు. ధర్మవరం అభ్యర్థిగా సత్యకుమార్ (భాజపా), చిలకలూరిపేట నుంచి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు (తెదేపా), నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి (వైకాపా) నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. నంద్యాల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి ఆయన నామినేషన్ పత్రాలను అందజేశారు.

తెలంగాణలో..

తెలంగాణలో పలువురు లోక్‌సభ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. చేవెళ్ల స్థానం నుంచి రంజిత్‌రెడ్డి (కాంగ్రెస్), కాసాని జ్ఞానేశ్వర్ (భారాస) నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. నల్గొండ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి (కాంగ్రెస్) నామపత్రాలను సమర్పించారు. ఖమ్మం ఎంపీ స్థానానికి కాంగ్రెస్ నేత రఘురాంరెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందించారు. అయితే ఖమ్మం స్థానంలో అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

నామినేషన్ దాఖలు చేసిన మాలోతు కవిత

మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా మాలోతు కవిత రెండు సెట్లతో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌కి అందజేశారు

నల్లగొండ పార్లమెంట్ స్థానానికి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి రెండు సెట్లతో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు అందజేశారు. ఆదిలాబాద్ స్థానానికి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా ఆత్రం సక్కు రెండు సెట్లతో తన నామినేష పత్రాలను రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు అందజేశారునాగర్ కర్నూల్ లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బర్రెలక్క నేడు నాగర్ కర్నూల్ కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

రాష్ట్ర సరిహద్దు ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ..

వరంగల్, ఏప్రిల్ 23: రాష్ట్ర సరిహద్దు ధాన్యం కొనుగోలు కేంద్రంను జిల్లా మేనేజర్, జిల్లా పౌర సరఫరాల అధికారి బి.రాంపతి తనిఖీ చేశారు. వాజేడు మండలంలోని చెరుకూరు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర సరిహద్దు ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వరి ధాన్యాన్ని నియంత్రించుటకు పలు సూచనలు జారీ చేశారు.ఆ వాహనాలకు సంబంధించిన పత్రాలను పూర్తిగా పరిశీలించి ఆ విషయాలను రిజిస్టర్ లో నమోదు చేసి, సందేహం ఉన్న వాహనాలపై చర్యలు తీసుకోవటం కోసం సంబంధిత అధికారుల దృష్టిలో ఉంచాలని ఆదేశించారు.

వాట్సాప్‌లో మరో సరికొత్త ఫీచర్.. ఇంటర్‌నెట్ లేకుండానే హెచ్‌డీ ఫొటోలు, ఫైల్స్ పంపొచ్చు..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ప్రముఖ ఇన్‌స్టంట్ మెసేజింగ్ కంపెనీ వాట్సాప్ యూజర్లకు శుభవార్త చెప్పింది. యూజర్ల ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్స్‌ను పరిచయం చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో ఫీచర్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. ఫీచర్ అందుబాటులోకి వస్తే ఫొటోలు, వీడియోలు, మీడియా తదితర ఫైల్స్ అన్నీ ఆఫ్‌లైన్‌లోనూ షేర్ చేసుకునే వెసులుబాటు కలుగనున్నది. ఈ ఫీచర్‌కు సంబంధించిన అప్‌డేట్‌ను వాట్సాప్ ఫీచర్స్‌ను ట్రాక్ చేసే వాబీటాఇన్ఫో తెలిపింది.మొబైల్‌లో ఇంటర్‌నెట్ సదుపాయం లేకుండా పంపే ఫైల్స్ సైతం ఎన్‌క్రిప్ట్ చేయబడుతాయని.. తద్వారా సెక్యూరిటీ ఉంటుందని నివేదిక పేర్కొంది. కొత్త ఫీచర్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ని సైతం రివీల్ చేసింది. ప్రస్తుతం ఈ ఫీచర్ బీటా టెస్టర్లకు అందుబాటులో ఉంది. విజయవంతమైతే త్వరలోనే అందరికీ అందుబాటులోకి రానున్నది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం ఇంటర్‌నెట్‌ను వినియోగించకుండా ఫైల్స్‌ను షేర్ చేసేందుకు బ్లూటూత్, షేర్‌ఇట్, నియర్‌బై షేర్ అప్లికేషన్స్‌తో ఫైల్స్‌ను షేర్ చేస్తున్న విషయం తెలిసిందే.ఇదే తరహాలోనే మెటా యాజమాన్యంలోని వాట్సాప్ ఈ యాప్‌ను తీసుకురాబోతున్నది. ఈ ఫీచర్ ఎనేబల్ చేసుకోవాలంటే వాట్సాప్ సిస్టమ్ ఫైల్, ఫొటోల గ్యాలరీ యాక్సెస్ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. మరో వైపు వాట్సాప్ తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదుపాయాన్ని పరిచయం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌పై సైతం పని చేస్తున్నది. చాట్‌లిస్ట్‌లో ఫేవరెట్స్ ఆప్షన్‌ను తీసుకురాబోతున్నది. ఇందులో యూజర్లకు తమకు ఇష్టమైన వ్యక్తులను అందులో యాడ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. దాంతో తరచూ చాట్‌చేసే వారితో పాటు కాంటాక్ట్స్ మొత్తం వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు.



పవన్ కల్యాణ్ సంపాదన 114 కోట్లు- అప్పులు 64 కోట్లు..

అమరావతి, ఏప్రిల్ 23: జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో తన ఆదాయం, అప్పులు, చెల్లించిన పన్నుల వివరాలు వెల్లడించారు. ఐదేళ్లలో ఆయన సంపాదన రూ.114,76,78,300. ఇందుకు ఆదాయపన్ను రూపంలో రూ.47,07,32,875, జీఎస్టీ కింద రూ.26,84,70,000 చెల్లించినట్టు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

పవన్ అప్పులు రూ.64,26,84,453గా ప్రకటించారు. ఇందులో వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు రూ.17,56,84,453, వ్యక్తుల నుంచి తీసుకున్నవి రూ.46.70 కోట్లు అని వివరించారు.

విరాళాలు రూ.20కోట్లు పైనే..

వివిధ సంస్థలు, జనసేన పార్టీ నిర్వహించిన సేవా కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాల కోసం రూ.17,15,00,000 విరాళం అందించినట్టు తెలిపారు. పార్టీ చేపట్టిన కౌలు రైతు భరోసా, జనసేన క్రియాశీలక కార్యకర్తల ప్రమాద బీమా లాంటి కార్యక్రమాల కోసం వేర్వేరు సందర్భాల్లో విరాళాలు అందజేసినట్టు వివరించారు. వివిధ సంస్థలకు రూ.3,32,11,717ల విరాళాలు అందచేశారు. కేంద్రీయ సైనిక్ బోర్డుకు రూ.కోటి, ఏపీ సీఎం సహాయ నిధికి రూ.50లక్షలు, తెలంగాణ సీఎం సహాయ నిధికి రూ.50లక్షలు, శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్‌కు రూ.రూ.30,11,717, పవన్ కల్యాణ్ వదిన నుంచి రెండు కోట్ల అప్పు

వ్యక్తి గత రుణాల కింద మొత్తం 15 మందితో నగదు తీసుకున్నారు. వారిలో పవన్ వదిన, చిరంజీవి భార్య కొణిదెల సురేఖ సైతం ఉండటం విశేషం. ఆమె దగ్గర రూ. 2 కోట్లు వ్యక్తి గత రుణం కింద పుచ్చుకున్నట్లు ఆఫిడవిట్లో పొందు పర్చారు. అంతే కాకుండా విజయలక్ష్మి వీఆర్- రూ.8,00,00,000, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ -రూ.6,35,00,000, లీడ్ ఐటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్- రూ. 6,00,00,000, ఎంవీఆర్ఎస్ ప్రసాద్- రూ. 3,50,00,000, యుర్నేని నవీన్- రూ. 5,50,00,000, ప్రవీణ్ కుమార్- రూ.3,00,00,000, మైత్రీ మూవీ మేకర్స్- రూ.3,00,00,000, శ్రీ యశ్వంత్ ఫైనాన్షియర్స్- రూ.3,00,00,000, రాహుల్ కుందవరం- రూ.2,80,00,000, ఎంవీఆర్ఎస్ ప్రసాద్ హిందూ అన్‌డివైడెడ్ ఫ్యామిలీ- రూ.2,00,00,000, కొణిదెల సురేఖ- రూ.2,00,00,000, కోటిరెడ్డి సాహిత్యరెడ్డి- రూ. 50,00,000, లింగారెడ్డి లలిత- రూ. 50,00,000, దయాకర్- రూ.45,00,000, డీవీవీ ఎంటర్‌ప్రైజెస్- రూ.10,00,000ల ద్వారా వ్యక్తిగత రుణాలు పొందినట్లు జాబితాలో ఉంది.

'భారత్ పే' అనే తొలి ఆల్ ఇన్ వన్ పేమెంట్ ప్రొడక్ట్ ను ఆవిష్కరణ

న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఫిన్ టెక్ కంపెనీ 'భారత్ పే' అనే తొలి ఆల్ ఇన్ వన్ పేమెంట్ ప్రొడక్ట్ ను ఆవిష్కరించింది. అందులో పాయింట్ ఆఫ్ సేల్(పిఓఎస్), క్యూఆర్, స్పీకర్ వంటివన్నీ సింగిల్ డివైస్ లో ఇన్ కార్పొరేట్ చేశారు. తొలి దశలో ఈ ప్రొడక్ట్ ను 100 నగరాలలో ఆవిష్కరించారు. మరో ఆరు నెలల్లో 450 నగరాలకు దీనిని విస్తరించనున్నారు. 'అనేక ఫంక్షనాలిటీలను కలగలపడం వల్ల ఇదో కాస్ట్ ఎఫెక్టివ్ డివైస్ గా మారింది, చిన్న, మధ్య బిజినెస్ లకు అనుగుణంగా సమగ్ర పరిష్కారాన్ని అందిస్తున్నాం' అని భారత్ పే సిఈవో నళిన్ నేగి ఓ ప్రకటనలో తెలిపారు.

వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు



ఖమ్మం, ఏప్రిల్ 23: (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలంలోని ఉప్పలచెలక గ్రామంలో బాదావత్ సైదులు కౌసల్య దంపతుల కుమారుడు సురేష్-పల్లవిల వివాహ రిసెప్షన్ వేడుక కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించిన వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాంపుడి రోశయ్య, రాయల పుల్లయ్య, పొట్లపల్లి శేషగిరిరావు, కొనకంచి మోసే, గుడివాడ వెంకటేశ్వర్లు, గూగులోత్ నాగేశ్వరావు, గణేష్,కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీలు దిష్టిబొమ్మలు- బోయినపల్లి వినోద్ కుమార్

కరీంనగర్,ఏప్రిల్ 23: బీజేపీ కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధానం పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందని?తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న సమ్మక్క బ్యారేజ్, అదనపు టీఎంసీ, సీతారామ ప్రాజెక్టు, వార్దా బ్యారేజ్ లకు అనుమతులు ఇచ్చాకనే.. ఇచ్చంపల్లి ముచ్చట మాట్లాడాలని ఈ విషయం లో బీజేపీ ఎంపీలు దిష్టిబొమ్మలు లాగా ఉండొద్దని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో మాట్లాడారు. గోదావరి..కృష్ణ రెండు నదులు నిరంతరం ప్రవహిస్తాయి. నదుల అనుసంధానం ద్వారా పూర్వపు కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో మళ్లీ నీటి గోస తప్పదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి గోదావరి నది ఒక కల్పతరువని.. కేంద్రం ఎంఓయూ రాష్ట్ర ప్రభుత్వాలకు పంపడం ఏంటన్నారు. గోదావరిలో తెలంగాణ వాటా తేల్చాలి కోటి ఎకరాలకు సాగు సాగునీళ్లు, త్రాగునీళ్లు ఇక్కడి నుంచే పోతాయని గోదావరి నది ప్రజలకు ఆధారమన్నారు.

ఇచ్చంపల్లి దగ్గర పెద్ద డ్యాం కట్టి నీళ్లను ఇతర రాష్ట్రాలకు తరలిస్తే ఇక్కడ చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఈ నదుల అనుసంధానం ద్వారా పెద్ద అటవీ ప్రాంతం కనుమరుగు కావడంతో పాటు, వ్యవసాయ భూములను కోల్పోవడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏం అడుగుతుందని ప్రశ్నించారు. తెలంగాణలో నలుగురు బీజేపీ ఎంపీలు గెలిచి దీనిపై ఏం స్పందించడం లేదన్నారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టు సర్వే 1985లో అప్పటి సీఎం ఎన్టీ రామారావు హయాంలో చేశారని పేర్కొన్నారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టు కార్యాలయం వరంగల్ లో ఉండేదని, అప్పుడు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు వ్యతిరేకించాయన్నారు. గంగా నది నుంచి మహానదికి ఇంత వరకు సర్వే లేదని, గోదావరి నుంచి కృష్ణ..కావేరి నదులకు అక్కడి నుంచి తమిళనాడుకు ఎలా తరలిస్తారని దుయ్యబట్టారు.

నీటి పంపకాల విషయం తేల్చకుండా ఎలా అనుసంధానం చేస్తారని, గోదావరి బేసిన్ లోతెలంగాణ వాటా 968 టీఎంసీలు రావాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ రైతాంగం ఏళ్ళ కాలంగా సాగునీళ్ల కోసం అనేక ఇబ్బందులు పడ్డారని, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాకనే రైతుల బాధలు తొలిగిపోయాయని పేర్కొన్నారు. ఈ నీళ్లు వస్తేనే రైతులకు సాగునీళ్లు వస్తాయని, కరీంనగర్, వరంగల్ జిల్లాల రైతులకు గోదావరి నీళ్లు మాత్రమే దిక్కన్నారు. నదుల అనుసంధానంపై బండి సంజయ్ సమాధానం చెప్పాలని, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చారని, బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఇప్పటి వరకు గోదావరి నీళ్లు వాడుకోవడం జరుగుతుందన్నారు. గోదావరి జలాలను తరలిస్తే బ్రతుకులు ఏమవుతాయని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టు లు కట్టారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నదుల అనుసంధానం నిలిపివేయాలని, గోదావరి నదిలో నీటి వాటాలు తేల్చాలన్నారు.

రాష్ట్రాలకు బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఈ లేఖలు రాసి ఆగం చేస్తోంది, 8-04-2024న కేంద్రం ఇతర రాష్ట్రాలకు లేఖలు రాసిందన్నారు. 47 టీఎంసీలతో సమ్మక్క బ్యారేజ్ కి క్లియరెన్స్, సీతారామ ప్రాజెక్టు, వార్దా ప్రాజెక్టుల అనుమతులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నోటికి ఏదీ వస్తే అది అర్థరహితంగా మాట్లాడుతన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాఫర్ డ్యాం కట్టక పోవడంతో 50 టీఎంసీల నీళ్లు వృధాగా పోయాయి. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిన అంశంపై కేంద్ర ప్రభుత్వం అధికారులు చూసి వెళ్లి ఐదు నెలలు అయినా ఇప్పటి వరకు నివేదిక ఇవ్వలేదన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి మేడిగడ్డ వద్ద కాఫర్ డ్యాం కోసం టెండర్లు పిలుస్తున్నామన్నారు. ఇన్ని రోజులు ఏమైందన్నారు. ఎంపీ బండి సంజయ్ స్పందించాలినదుల అనుసంధానం చేయడం కాదు. దేవుళ్ళ పేరు మీద బ్యారేజీలు, ప్రాజెక్టు లు కట్టినోల్లం మాకు చెప్పుతారా దేవుడి గురించిఎంపీ బండి సంజయ్ ధర్మం అని చెప్పడం ఏంటి?ధర్మం అంటే తన పని తాను చేయాలితెలంగాణలోని పెండింగ్ ప్రాజెక్టుల అనుమతుల కోసం ప్రాజెక్టుల అనుమతుల కోసం ప్రభుత్వంతో కలిసి పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు, నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవిందర్ రావు, మేయర్ నునీల్ రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి.రామకృష్ణ రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ అధ్యక్షుడు పొన్నం అనీల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్నికలపై ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు

అమరావతి ఏప్రిల్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏపీ ఎన్నికలపై ఎన్నికల సంఘం కీలక సూచనలు చేసింది. ఈ సందర్భంగా ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మీడియా తో మాట్లాడుతూ... వలంటీర్ల ద్వారా పెన్షన్లను పంపిణీ చేయొద్దని కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.ఈసీ చెప్పిన ప్రకారం రాష్ట్రప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందన్నారు. గ్రామ సచివాలయాలకు వచ్చి లబ్ధిదారులు పెన్షన్లు పొందాలని ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ ఆదేశాలు జారీ చేసిన తర్వాత కేవలం రెండు రోజుల్లోనే 95శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేశారని తెలిపారు. దివ్యాంగులకు ఇళ్లవద్దే పెన్షన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారని గుర్తుచేశారు. అయినా 32 మంది ఏపీవ్యాప్తంగా మరణించినట్లు విపక్షాలు ఫిర్యాదులు చేశాయని అన్నారు.ఏపీలో సచివాలయ సిబ్బంది లక్షా 30 వేలమందితో పాటు పంచాయతీ సిబ్బందిని వాడుకోని ఇంటింటికీ పెన్షన్‌లు పంపిణీ చేయాలనే డిమాండు వచ్చిందని అన్నారు. విపక్ష పార్టీల నుంచి ఈ ఫిర్యాదులు కూడా అందాయని.. వాటిని ఈసీఐకి పంపించినట్లు వివరించారు. వారి నుంచి సమాధానం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. అక్కడి నుంచి వచ్చే ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.విపత్తు నివారణ శాఖ కూడా రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై ఇస్తున్న రిపోర్టులను కూడా పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. తిరుపతిలో 35వేల డూప్లికేట్ ఎపిక్ కార్డుల విషయంలోనూ ఫిర్యాదులు వచ్చాయని చెప్పుకొచ్చారు. ఈ ఫిర్యాదుల సారాంశం అక్కడ దొంగఓట్లు ఉన్నట్టు కాదని.. డూప్లికేట్ కార్డుల ద్వారా అసలు వారు కాకుండా వేరేవారు ఓట్లు వేస్తున్నారనే ఫిర్యాదు అని చెప్పారు.అందుకే ఈసారి పోలింగ్ నాటికి వారం ముందుగానే అందరికి ఓటర్ స్లిప్‌లు పూర్తిగా అందజేయాలని ఆదేశించామన్నారు. ఈసారి అలాంటి తప్పు జరగకుండా గట్టి చర్యలు తసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు.పోస్టల్ బ్యాలెట్ విషయంలో కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఆర్వోలు తీసుకోవాడం లేదని ఫిర్యాదు చేశాయన్నారు.

ఈ విషయంపై తక్షణం స్పందించి యూనిఫాం నిబంధనలను అందరికీ తెలియజేశామన్నారు. ఈ ప్రక్రియ సజావుగా జరుగుతుందని భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మొత్తం 46వేల 165 పోలింగ్ స్టేషన్లు ఉండగా 12వేల 459 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించామని అన్నారు. ఇప్పటి వరకూ 141 కోట్లకు పైగా డబ్బు, మద్యం, విలువైన వస్తువులు, డ్రగ్స్ తదితరాలు సీజ్ చేశామని తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గంలో పోలింగ్ సిబ్బందిని 6 పోలింగ్ స్టేషన్లకు ఎయిర్ లిఫ్ట్ చేస్తామన్నారు.తమిళనాడు పోలింగ్ మొదటి ఫేజ్‌లో ఉన్నందున అక్కడి నుంచి పోలీస్ సిబ్బందిని రాష్ట్రానికి కావాలని కోరుతామని చెప్పారు. కర్నాటక, ఒడిస్సా నుంచి కూడా పోలీస్‌లను తీసుకుంటామన్నారు. తెలంగాణలో కూడా లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున ఆరోజు బోర్డర్‌ను సీజ్ చేస్తామన్నారు.తెలంగాణలో ఓటు ఉండి ఇక్కడ కూడా ఓటు హక్కు వినియోగించు కోవాలనుకునే వారు రాకుండా వారిని గుర్తించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. తెలంగాణ నుంచి మద్యం రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని వివరించారు. సస్పెండ్ అయినా, రాజీనామా చేసిన వలంటీర్లను ఎన్నికల ఏజెంటుగా పెట్టాలా వద్ద అనేదానిపై ఈసీఐ వద్దకు నివేదిక పంపమని వారి నుంచి సమాచారం వచ్చాక నిర్ణయం తీసుకుంటామని అన్నారు.సీఎస్, డీజీపీ, ఇంటిలిజెన్స్ చీఫ్‌లపై వచ్చిన ఫిర్యాదులను ఈసీఐకు పంపామని వారి ఆదేశాల మేరకు ఈ అధికారుల వివరణ తీసుకుని రిపోర్టు నివేదించామన్నారు. వారి నుంచి ఇంకా సమాచారం రావాల్సి ఉందని.. దాని ప్రకారం తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రభుత్వం సలహదార్లకు కూడా కోడ్ వర్తిస్తుందన్నారు. వారు ప్రభుత్వ ఆఫీసును, వెహికిల్స్‌ను ఇతర సౌకర్యాలను వాడకూడదని ఆదేశించారు.

ఏపీలో హింసాత్మక సంఘటనలు కోడ్ వచ్చాక జరిగినందునే రాష్ట్రాన్ని ఈసీఐ సమస్యాత్మకంగా చూస్తోందన్నారు. అందుకే ఎన్నడూ లేని విధంగా పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక పోలీస్ అబ్జర్వర్‌లను నియమిస్తోందన్నారు. ఓటర్లు ధైర్యంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈసారి భారీ ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఈఓ మీనా కోరారు.

ఎల్లమ్మ దేవాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23: నారాయణ పేట జిల్లా కర్ని గ్రామంలో గ్రామ దేవత శ్రీ ఎల్లమ్మ అమ్మవారి నూతన ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఇవాళ నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులను చల్లగా చూస్తూ, అంటు వ్యాధుల నుండి రక్షిస్తూ, పంటలను పచ్చగా ఉండేలా చేస్తూ, గ్రామాన్ని భూత ప్రేతాలనుండి రక్షిస్తూ గ్రామ పొలిమేరలలో సదా కాపు కాస్తూ ఉండే గ్రామ దేవత మూర్తిని గ్రామదేవతలు అంటారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని చల్లగా చూడాలని రానున్న వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో కళకళలాడేలా దీవించాలని అమ్మవారిని వేడుకుంటున్నట్లు తెలిపారు.

పేదల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్-నీలం మధు

మెదక్, ఏప్రిల్ 23: (కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా పేదల పక్షాన నిలబడుతుందని మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. నీలం మధు మంగళవారం పటాన్ చెరు మండలం ఇంద్రేశం పిఎన్ఆర్ టౌన్ షిప్ కాలనీవాసులను కలిశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎంపీ అభ్యర్థి మధును సన్మానించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని అభ్యర్థించారు. పేదల పక్షాన నిలబడిన కాంగ్రెస్ పార్టీ వారి అభ్యున్నతికి పాటుపడుతోందన్నారు.

రానున్న రోజుల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, కాలనీవాసులు శ్రీకాంత్, జగదీష్, నాగేశ్వర్, భోజరాజు, సత్తయ్య, గోపి, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు..

మెదక్ జిల్లాలో విశిష్టత గాంచిన చాకరిమెట్లలోని ఆంజనేయ స్వామి వారిని ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ మంగళవారం దర్శించుకున్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని చాకరిమెట్లలోని శ్రీ సహకార ఆంజనేయ స్వామివారిని మెదక్ డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డిలతో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నీలం మధుతో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ సుహాసిని, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, రవీందర్ రెడ్డి, లక్ష్మీపతిరావు, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భగలాముఖి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు..

ఎంపీ అభ్యర్థి మధు ను సన్మానించిన ట్రస్ట్

శివంపేటలోని శ్రీ భగలాముఖి శక్తిపీఠం అమ్మవారిని ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి మధు ను ట్రస్టు సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మెదక్ డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గుప్తా, రవీందర్ రెడ్డి, గుర్రాల మల్లేష్, ఉదయ్ కుమార్, శివకుమార్, నాగులూరి మల్లేష్, వెంకట్ గౌడ్, ట్రస్ట్ సభ్యులు వెంకటేశ్వరశర్మ, శివకుమార్ గౌడ్, పురుషోత్తం శర్మ, పద్మ మహేష్, మారుమూల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ లో బైక్ స్కిడ్ అయి యువకుడు.. పై నుంచి బస్సు దూసుకెళ్ళిన బస్సు

ఉప్పల్ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మేడ్చల్ జిల్లా ఉప్పల్ లో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో చోటుచేసుకుంది. ఉప్పల్ లో బైక్ స్కిడ్ అయి యువకుడు కిందపడిపోయాడు. అతడి పై నుంచి బస్సు దూసుకెళ్లడంతో ఘటనా స్థలంలోనే యువకుడు మృతి చెందాడు. వర్షిత్ రెడ్డి అనే యువకుడు బైక్ పై వెళుతండగా కిందపడిపోయాడు. వెనుక నుంచి వస్తున్న బస్సు అతడి పైనుంచి పోవడంతో తీవ్రంగా గాయపడి వర్షిత్ రెడ్డి చనిపోయాడు. తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని గుండెలు బాదుకొని కన్నీంటిపర్యంతమయ్యారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడని వాపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫ్లైఓవర్ నిర్మాణంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఫ్లైఓవర్ పనులు చేపటి రెండు-మూడు సంవత్సరాలు గడిచిన ఇంకా పనులు పూర్తి కావడంలేదని మండిపడుతున్నారు. ఫ్లైఓవర్ కోసం తీసిన గుంతలతోనే యువకుడి ప్రాణాలు పోయాయని మృతుడి తల్లిదండ్రులు ఆరోపణలు చేశారు. ఇప్పటికైనా ఫ్లైఓవర్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఉప్పల్, మేడిపల్లి వాసులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరగా స్పందించి ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షేమ విద్యార్థి వసతి గృహాల అద్దెలను విడుదల చేయండి..

-బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్

హైదరాబాద్ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సంక్షేమ హాస్టల్స్ లో ఉన్నటువంటి విద్యార్థుల వసతి గృహాల అద్దెలను చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు, ప్రభుత్వాధీనంలో నడుస్తున్నటువంటి ప్రైవేట్ బిల్డింగ్ లలో కనీస మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు కోరడంతో వారికి రెండు సంవత్సరాలుగా అద్దెలు చెల్లించకపోవడం వలన ప్రైవేట్ బిల్డింగ్ ఓనర్స్ హాస్టల్ ఖాళీ చేయాలని విద్యార్థుల పైన ఒత్తిడి తీసుకొని వస్తున్నారు. కావున ప్రభుత్వం స్పందించి సంక్షేమ హాస్టల్స్ విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా వారికి అద్దెలు చెల్లించాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు... ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ద్రోణాచారి, మహేష్ మేరు, అనిల్, తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు....

మోదీ వెన్నులో వణుకు పుడుతోంది -మంత్రి పొన్నం

హైదరాబాద్, ఏప్రిల్ 23: మొదటి దశ ఓటింగ్ తర్వాత మోదీ వెన్నులో వణుకు పుడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లింలకు ఆస్తులు పంచుతుందని స్వయంగా ప్రధానమంత్రి అనడం విచారకనమన్నారు.

పాంచ్ న్యాయ్, కులగణన వంటివి బీజేపీకి రుచించడం లేదని, ప్రధాని స్థాయిలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం వహించాల్సిన మోదీ నీచంగా మాట్లాడుతున్నారన్నారు. ఈ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలన్నారు. మేము అన్నివర్గాలకు న్యాయం చేసే విధంగా పాలించామని, 80 శాతం ఉన్న హిందువులకు మా కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసిందా..? ఏకపక్ష మెజార్టీ మీకు ఇచ్చినా.. మీరు హిందువులకు ఏం చేశారు? అని బీజేపీపై విమర్శలు గుప్పించారు.

భారతదేశంలో టెక్నాలజీ ఎగ్నోస్టిక్ అడ్వాన్స్ డ్ కెమిస్ట్రీ సెల్స్ తయారీని పిఎల్ఐ ఎసిసి పథకం ప్రోత్సహిస్తుంది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పదిగీగా వాట్ అవర్స్ (జిడబ్ల్యుహెచ్) ఉత్పాదన సామర్థ్యాన్ని కలిగివుండేటటువంటి అడ్వాన్స్ డ్ కెమిస్ట్రీ సెల్ (ఎసిసి) తయారీ కై ఉత్పాదన తో ముడి పెట్టిన ప్రోత్సాహకాల (పిఎల్ఐ) యొక్క రీబిడ్డింగ్ కోసం భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎమ్‌హెచ్ఐ) 2024 జనవరి 24 వ తేదీ నాడు ప్రకటించిన గ్లోబల్ టెండర్ కు ఏడు వేలందారు సంస్థ ల వద్ద నుండి బిడ్స్ అందాయి. ప్రీ-బిడ్ మీటింగ్ ను 2024 ఫిబ్రవరి 12 వ తేదీ నాడు నిర్వహించడమైంది. సిపిపి పోర్టల్ లో దరఖాస్తుల స్వీకరణ కు చివరి తేదీ 2024 ఏప్రిల్ 22 కాగా టెక్నికల్ బిడ్స్ ను 2024 ఏప్రిల్ 23 వ తేదీ న తెరవడమైంది.

ఈ టెండరు కు స్పందించి బిడ్ లను దాఖలు చేసిన బిడ్డర్ ల జాబితా లో (ఇంగ్లీషు అక్షరమాల ప్రకారం చూస్తే) ఎసిఎమ్ఇ క్లీన్ టెక్ సొల్యూశన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అమర రాజా అడ్వాన్స్ డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, అన్వి పవర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, జెఎస్‌డబ్ల్యు నియో ఎనర్జీ లిమిటెడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, లుకాస్ టివిఎస్ లిమిటెడ్ లతో పాటు, వారీ ఎనర్జీస్ లిమిటెడ్ లు 70 జిడబ్ల్యుహెచ్ ఉత్పాదన సామర్థ్యం కలిగి ఉండే యూనిట్ లను ఏర్పాటు చేస్తామంటూ ముందుకు వచ్చాయి.

మొత్తం 18,100 కోట్ల రూపాయల వ్యయం తో ఏభై జిడబ్ల్యుహెచ్ ఉత్పాదన సామర్థ్యాన్ని సాధించడం కోసం ఉద్దేశించినటువంటి 'నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ అడ్వాన్స్ డ్ కెమిస్ట్రీ సెల్ బ్యాటరీ స్టోరేజ్' కు సంబంధించి ఒక ఎగ్నోస్టిక్ పిఎల్ఐ స్కీము కు 2021 వ సంవత్సరం మే నెల లో మంత్రిమండలి ఆమోదాన్ని తెలిపింది. ఎసిసి పిఎల్ఐ బిడ్డింగ్ లో ఒకటో విడత ప్రక్రియ 2022 మార్చి నెల లో ముగిసింది. మూడు లబ్ధిదారు సంస్థల కు మొత్తం ముప్పై జిడబ్ల్యుహెచ్ ఉత్పాదన సామర్థ్యాన్ని కేటాయించడమైంది. ఎంపిక చేసిన సంస్థల తో 2022 జులై నెల లో ఒప్పందాన్ని కుదుర్చుకోవడమైంది.

దీనికి అదనం గా, మొత్తం పది జిడబ్ల్యుహెచ్ ఉత్పాదన సామర్థ్యాన్ని కలిగి ఉండే ఎసిసి తయారీ యూనిట్లు ల ఏర్పాటు కు గరిష్ఠం గా 3,620 కోట్ల బడ్జెటరీ అవుట్ లే ను ప్రతిపాదిస్తూ భారత ప్రభుత్వం లోని భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ 'నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ అడ్వాన్స్ డ్ కెమిస్ట్రీ సెల్ బ్యాటరీ స్టోరేజ్' లో భాగం గా బిడ్డర్ ల తాత్కాలిక ఎంపిక కోసం 2024 జనవరి 24 వ తేదీ నాడు ఒక రిక్వెస్ట్ ఫార్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పి) ను విడుదల చేసింది.

దుండిగల్‌లో దారుణం.. మహిళను రాయితో కొట్టి చంపిన దుండగులు

హైదరాబాద్, ఏప్రిల్ 23: దుండిగల్‌లో దారుణం చోటు చేసుకుంది. ఓ మహిళను గుర్తు తెలియని దుండగులు రాళ్లతో కొట్టి చంపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సక్కుబాయి అనే మహిళ కుటుంబ కలహాలతో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె కుమారుడు శేఖర్ తన తల్లి అదృశ్యమైందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నదుల అనుసంధానంతో తెలంగాణకు అన్యాయం

-గోదావరి జలాలు తరలిస్తే ఉత్తర తెలంగాణ పరిస్థితి ఏంటి

- కరీంనగర్ బిఆర్ఎస్ అభ్యర్థి బోయిన్ పల్లి వినోద్ కుమార్

హైదరాబాద్ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్) : నదుల అనుసంధానానికి కేంద్రం కసరత్తు చేస్తోందని కరీంనగర్ బిఆర్ఎస్ అభ్యర్థి బోయిన్ పల్లి వినోద్ కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. నదుల అనుసంధానంతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని, సమ్మక్క-సారక్క సీతారామ ప్రాజెక్టులకు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులకు అనుమతి తరువాతే అనుసంధానంపై ఆలోచన చేయాలని, తెలంగాణకు వచ్చే జలాలను కొల్లగొట్టేలా కేంద్రం, రాష్ట్రం చర్యలు తీసుకుంటోందని దుయ్యబట్టారు. గోదావరి జలాలు తరలిస్తే ఉత్తర తెలంగాణ పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎవరూ పట్టించుకోరనే ఎంవొయు ఇచ్చారని మండిపడ్డారు.

రాజకీయ నేతలు 'తరచు' పార్టీలు మారడం 'కలవరం కలిగిస్తోంది'

-ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కఠినం చేయాలి

-ఉచితాల' ప్రకటనను నిరుత్సాహపరచాలి

-వాగ్దానాలపై నేతలు, పార్టీలను జనం నిలదీయాలి

-మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు సూచన



న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : రాజకీయ నేతలు 'తరచు' పార్టీలు మారడం 'కలవరం కలిగిస్తోంది' అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు మంగళవారం చెప్పారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత కఠినంగా మార్చాలని ఆయన పిలుపు ఇచ్చారు. పద్మ విభూషణ్ అవార్డు స్వీకరణ అనంతరం న్యూఢిల్లీలోని తన నివాసంలో ఒక కార్యక్రమంలో వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, నిధులు ఎలా సమీకరించేది వివరించకుండానే ఎన్నికల సమయంలో 'ఉచితాలు' ప్రకటించడం సమంజసం కాదని అన్నారు. వాటిని నిరుత్సాహపరచాలని, అటువంటి బడా వాగ్దానాలు చేసే నేతలు, పార్టీలను ప్రజలు ప్రశ్నించాలని వెంకయ్య నాయుడు పిలుపు ఇచ్చారు. సోమవారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో వెంకయ్య నాయుడుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్మ విభూషణ్ అవార్డు ప్రదానం చేసిన విషయం విదితమే. 'ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మనం మరింత కఠినతరం చేయాలి' అని ఆయన ఉద్ఘాటించారు. 'ఇప్పుడు ప్రజా జీవితంలో ప్రమాణాల పతనం కలవరం కలిగిస్తోంది. రాజకీయ పార్టీల్లో వ్యక్తులు తమ పార్టీలను తరచు మారుస్తుంటారు. తాజా సరళి ఎలా ఉంది అంటే ఉదయం ఒక పార్టీలో ఉన్నవారు సాయంత్రం మరొక పార్టీలో చేరుతూ, మీ నాయకుని విమర్శిస్తారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడతారు. వారిలో కొందరికి టిక్కెట్లు కూడా ఇస్తున్నారు. ఇది ఎంతగానో ఆందోళన కలిగిస్తోంది. జనం ఇలా చేయకూడదు. వ్యక్తులు పార్టీలో పని చేస్తూ తమ అర్హతలను రుజువు చేసుకోవాలి. ఎవరైనా పార్టీ మారాలని అభిలషిస్తే వారు తమకు పార్టీ ఇచ్చిన పదవికి రాజీనామా చేసి ఆ తరువాతే మరొక పార్టీలో చేరాలి. ఆరోపణలు చేయడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ జరుగుతోంది ఏమిటంటే ఆరోపణలు చేయడం కాదుడ దూషించడం' అని వెంకయ్య నాయుడు అన్నారు. మరొక అసమంజస వైఖరి ఏమిటంటే వ్యక్తులు డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో ఆలోచించకుండానే ఎడాపెడా వాగ్దానాలు చేస్తుండడం. అక్కడ డబ్బే లేదు. రాజకీయ పార్టీలు ముందు మేనిఫెస్టోతో రావాలి. తరువాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి పథకాలతో ముందుకు రావాలి. అటుపిమ్మట తాము వనరులను ఎలా సమీకరిస్తామో, ఏవిధంగా వ్యయం చేయాలనుకుంటున్నామో ప్రకటించాలి' అని వెంకయ్య నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. 'డబ్బు చెట్లకు కాయదు' కనుక ప్రతిదీ ఎలా ఉచితంగా ఇవ్వడం ఎలా సాధ్యం అవుతుందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దుర్బలంగా ఉన్నా కొందరు నేతలు, పార్టీలు ఎడాపెడా వాగ్దానాలు చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. రాష్ట్రాలపై లక్షల కోట్ల రూపాయల ఆర్థిక భారం ఉన్నప్పటికీ నేతలు వాగ్దానాలు చేస్తున్నారని, ప్రతిదీ ఉచితంగా ఇస్తామని వాగ్దానం చేస్తున్నారని ఆయన విమర్శించారు. 'నేను ఉచితాలకు వ్యతిరేకిని. విద్య, ఆరోగ్యం ఉచితంగా ఇవ్వడానికి నేను అనుకూలం. విద్య, ఆరోగ్యం ఉచితం చేయండి. తక్కినవాటిని తప్పించుకోండి. కానీ వారు అలా చేయడం లేదు' అని వెంకయ్య నాయుడు విచారం వెలిబుచ్చారు. హేయనీయమైన భాష వాడే, అవినీతిపరులని తెలిసిన అభ్యర్థులను తిరస్కరించవలసిందని వోటర్లకు వెంకయ్య నాయుడు విజ్ఞప్తి చేశారు.

ప్రపంచంలోనే ఎత్తైన యుద్ధ క్షేత్రం సియాచిన్‌లో రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పర్యటన, భద్రత పరిస్థితిపై సమీక్ష

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: భారత రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రం సియాచిన్‌ను సందర్శించారు, అక్కడి భద్రత పరిస్థితిని ప్రత్యక్షంగా సమీక్షించారు. క్లిష్టమైన వాతావరణం, కఠినమైన ప్రాంతంలో దేశ సరిహద్దులను పహారా కాస్తున్న సైనికులతో రక్షణ మంత్రి సంభాషించారు. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ పాండే, జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్, నార్తర్న్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ ఎంవీ సుచీంద్ర కుమార్, జనరల్ ఆఫీసర్ కమాండింగ్, 14 కార్ప్స్ లెఫ్టినెంట్ జనరల్ రషీమ్ బాలి కూడా రక్షణ మంత్రితో పాటు సియాచిన్ వెళ్లారు.

సియాచిన్‌లో సైనికుల మోహరింపును గగనమార్గం ద్వారా పరిశీలించిన శ్రీ రాజ్‌నాథ్ సింగ్, సముద్ర మట్టానికి 15,100 అడుగుల ఎత్తులో ఉన్న సైనిక స్థావరంలో దిగారు. సియాచిన్‌లో బలగాల సంసిద్ధత, భద్రత పరిస్థితులపై రక్షణ మంత్రికి సైనిక అధికార్లు క్లుప్తంగా వివరించారు. క్షేత్ర స్థాయి సవాళ్లకు సంబంధించిన అంశాలను కూడా శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చర్చించారు.

సైనికులను ఉద్దేశించి మాట్లాడిన రక్షణ మంత్రి, సియాచిన్‌లో విధులు నిర్వహిస్తున్న సైనికులను కొనియాడారు. తీవ్రమైన పరిస్థితుల్లోనూ పరాక్రమం, దృఢ సంకల్పంతో మాతృభూమిని రక్షించే ధర్మమార్గంలో నడుస్తున్నారంటూ అభినందించారు. సాయుధ దళాల సిబ్బందికి దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని, వారి త్యాగాల వల్లే ప్రతి పౌరుడు సురక్షితంగా ఉన్నాడని అన్నారు. "మన వీర సైనికులు సరిహద్దుల వద్ద దృఢంగా, అడ్డుగోడలా నిలబడ్డారనే భరోసాతో మేమంతా ప్రశాంతంగా జీవిస్తున్నాం. భవిష్యత్‌లో, మన దేశ భద్రత గురించి రాస్తున్నప్పుడు, మంచుతో నిండిన ఈ చల్లని హిమానీనదంలో మన సైనికుల ధైర్యసాహసాలు, ఉక్కు సంకల్పాన్ని సగర్వంగా గుర్తు చేసుకుంటాం. భవిష్యత్ తరాలకు అది ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది" అని చెప్పారు.

సియాచిన్ సాధారణ భూమి కాదని, భారతదేశ సార్వభౌమాధికారం డ సంకల్పానికి చిహ్నమని రక్షణ మంత్రి అభివర్ణించారు. భారతదేశానికి జాతీయ రాజధాని దిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై, సాంకేతిక రాజధాని బెంగళూరు అయినట్లే, ధైర్యం, దృఢ సంకల్పానికి రాజధాని సియాచిన్ అని అన్నారు.

'ఆపరేషన్ మేఘ్‌దూత్' 40వ వార్షికోత్సవాన్ని భారతదేశం ఇటీవల జరుపుకుంది. 1984 ఏప్రిల్ 13న సియాచిన్‌లో భారత సైన్యం ప్రారంభించిన ఈ ఆపరేషన్ దేశ సైనిక చరిత్రలో సువర్ణ అధ్యాయమని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. "ఆపరేషన్ మేఘ్‌దూత్ విజయం మనందరికీ గర్వకారణం" అని అన్నారు.

సియాచిన్ యుద్ధ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచిన రక్షణ మంత్రి, దేశ సేవలో ప్రాణాలు అర్పించిన అమర సైనికులకు నివాళులు అర్పించారు.

గత నెల 24న లేహ్‌ను సందర్శించిన శ్రీ రాజ్‌నాథ్ సింగ్, సైనికులతో కలిసి హోలీ జరుపుకున్నారు. అప్పుడే ఆయన సియాచిన్‌ను కూడా సందర్శించాల్సి ఉన్నా ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పర్యటన వాయిదా పడింది. సియాచిన్‌లోని సైనికులతో లేహ్ నుంచి ఫోన్‌లో మాట్లాడిన రక్షణ మంత్రి, తాను త్వరలోనే అక్కడి వస్తానని, వారితో ప్రత్యక్షంగా మాట్లాడతానని చెప్పారు. తీరిక లేని పనులు ఉన్నప్పటికీ సియాచిన్‌ను సందర్శించిన శ్రీ రాజ్‌నాథ్ సింగ్, తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.

సహకార పరిశోధన & శిక్షణ కోసం AFMS & IIT ఢిల్లీ ఇంక్ ఎంఒయూ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ 22 ఏప్రిల్ 2024న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీతో సహకార పరిశోధన మరియు శిక్షణ కోసం అవగాహన ఒప్పందం పై సంతకం చేసింది. డైరెక్టర్ జనరల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ లెఫ్టినెంట్ జనరల్ దల్జిత్ సింగ్ మరియు ఈ ఎమ్ఒయుపై సంతకం చేశారు.

ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్ ప్రొఫెసర్ రంగన్ బెనర్జీ. ఈ అవగాహనా ఒప్పందపు పరిధిలో నవల వైద్య పరికరాలను అభివృద్ధి చేయడానికి పరిశోధన మరియు ఆవిష్కరణలను చేపట్టడం మరియు విభిన్న భూభాగాల్లో సైనికులకు సేవలందించే నిర్దిష్ట ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారిస్తుంది.

IIT ఢిల్లీ బలమైన బయోమెడికల్ రీసెర్చ్ ఎకోసిస్టమ్‌ను కలిగి ఉంది, ఇది సాయుధ దళాలలో ఎదురయ్యే విభిన్న వైద్య సవాళ్లపై పరిశోధనకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని అందించడానికి అనువైనది, ఇందులో అవయవదానం చేయబడిన వారి పునరావాసం ఉంది. ఈ ఎమ్ఒయు పరిధిలో, ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమం, ఉమ్మడి విద్యా కార్యకలాపాలు మరియు ఉమ్మడి పిహెచ్‌డి ప్రోగ్రామ్‌ల అభివృద్ధి కూడా ప్రణాళిక చేయబడుతుంది.

ఈ సందర్భంగా, ఆఉంఈఓ లెఫ్టినెంట్ జనరల్ దల్జిత్ సింగ్ మాట్లాడుతూ, ఆఈఓ సైనికులకు అత్యున్నత స్థాయి వైద్య సంరక్షణను అందించడానికి అంకితం చేయబడిందని మరియు ఎఎ వంటి జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థలతో సహకరించడం ఈ నిబద్ధతకు ఒక ముఖ్యమైన అడుగు అని తెలియజేశారు. దేశానికి మరియు సాయుధ దళాలకు ప్రయోజనకరమైన పరిశోధన మరియు శిక్షణ కోసం ఈ ఎమ్ఒయు పూర్తి అవకాశాలను కలిగి ఉందని ఐఐటి ఢిల్లీ డైరెక్టర్ ప్రొఫెసర్ రంగన్ బెనర్జీ వ్యాఖ్యానించారు.

బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆస్తులు రూ.4వేల కోట్లు

హైదరాబాద్ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: లోక్‌సభ ఎన్నికల వేళ మాజీ ఎంపి, చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సరికొత్త రికార్డు సృష్టించారు. ఏకంగా వేల కోట్ల ఆస్తులు అఫిడవిట్‌లో పొందుపర్చారు. నామినేషన్‌లో భాగంగా కొండా విశ్వేశ్వరరెడ్డి సోమవారం దాఖలు చేసిన అఫిడవిట్ హాట్ టాపిక్‌గా నిలిచింది. విశ్వేశ్వర్‌రెడ్డి, ఆయన భార్య, కొడుకుకు కలిపి మొత్తం రూ.4,488 కోట్లు చరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వీటికి స్థిరాస్తులు కలిపితే మొత్తం ఆస్తులు రూ.4,564.21 కోట్లు. ఈ ఆస్తులతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దేశంలోనే శ్రీమంతులైన రాజకీయ నాయకుల్లో నెంబర్‌వన్‌గా నిలిచే చాన్స్ ఉంది. ఇక చరాస్తుల వివరాల్లోకి వెళితే.. విశ్వేశ్వర్‌రెడ్డికి రూ.1178 కోట్లు, విశ్వేశ్వర్‌రెడ్డి భార్య సంగీతా రెడ్డికి 3203 కోట్లు, విశ్వేశ్వర్‌రెడ్డి కొడుకు విరాజ్ మాధవ్‌కు రూ.107 కోట్లుగా చూపారు. ఇక స్థిరాస్తుల వివరాల్లోకి వెళితే.. విశ్వేశ్వర్‌రెడ్డికి రూ.71.34 కోట్లు, విశ్వేశ్వర్‌రెడ్డి భార్య సంగీతారెడ్డికి రూ.3.6 కోట్లు, విశ్వేశ్వర్‌రెడ్డి కొడుకు విరాజ్ మాధవ్‌కు రూ.1.27 కోట్లుగా చూపారు. ఇక అప్పుల విషయానికొస్తే.. విశ్వేశ్వర్‌రెడ్డికి అప్పులు రూ.1.76 కోట్లు, విశ్వేశ్వర్‌రెడ్డి భార్య సంగీతారెడ్డికి అప్పులు రూ.12 కోట్లుగా చూపారు. ఇక విశ్వేశర్‌రెడ్డికి, ఆయన కుటుంబానికి ఉన్న ఆస్తుల్లో ఎక్కువ భాగం అపోలో హాస్పిటల్స్ గ్రూపునకు సంబంధించిన షేర్లే, విశ్వేశ్వర్‌రెడ్డికి అపోలో లో రూ.973 కోట్ల విలువైన షేర్లు ఉండగా, ఆయన భార్యకు రూ.1500 కోట్ల విలువైన షేర్లు ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల నాటి నుంచి ఇప్పటివరకు అపోలో గ్రూపు షేర్లు స్టాక్ మార్కెట్లో దూసుకెళుతుండటంతో మాజీ ఎంపి ఆస్తుల విలువ భారీగా పెరిగినట్లు సమాచారం. ఇక భూముల విషయానికొస్తే విశ్వేశ్వర్‌రెడ్డికి హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల మొత్తం 70 ఎకరాల భూమి ఉంది. ఆయన భార్యకు 14 ఎకరాల భూమి ఉంది. ఇవే కాకుండా 45432 స్క్వేర్ ఫీట్ల విస్తీర్ణం గల నివాస భవనాలున్నాయి. ఇక వాణిజ్య భవనాల విషయానికొస్తే బంజారాహిల్స్ రోడ్ నెం.12లో ఒకటి, ఉస్మాన్‌గంజ్‌లో 14 షాపులు, జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 86లో ఒక షాపింగ్ కాంప్లెక్స్ ఉన్నాయి.

లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి భంగపాటు తప్పదు : శత్రుఘ్న సిన్హా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ప్రధాని నరేంద్ర మోదీకి పశ్చిమ బెంగాల్ ప్రజలు ఓటుతో దీటైన సమాధానం ఇస్తారని ప్రముఖ నటుడు, అసన్‌సోల్ టీఎంసీ అభ్యర్థి శత్రుఘ్న సిన్హా అన్నారు. ప్రధాని మోదీ అభ్యంతరకర భాష వాడటం యాధృచ్ఛికం కాదని, గతంలోనూ ఆయన దీదీ ఓ దీదీ అంటూ సీఎంను అవమానిస్తే రాష్ట్ర ప్రజలు దీటుగా బదులిచ్చారని, ఈసారి కూడా బెంగాల్ ప్రజలు మోదీకి గట్టిగా బుద్ధిచెబుతారని స్పష్టం చేశారు.

టీఎంసీ అభ్యర్థులను భారీ మెజారిటీతో బెంగాల్ ప్రజలు గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అసన్‌సోల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి శత్రుఘ్న సిన్హా మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. బెంగాల్‌లో సీఎం మమతా బెనర్జీ చేసిన అభివృద్ధి పనులే తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తమ రోడ్‌షోకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని, ప్రజలు తమ పట్ల అత్యంత ఆదరణ, ఆప్యాయతలను కనబరిచారని పేర్కొన్నారు.

మమతా బెనర్జీ చేసిన పనులే తమను గెలిపిస్తాయని, ఇవాళ బెంగాల్ ఆలోచించిన తరహాలోనే భారత్ కూడా ఆలోచిస్తుందని అదే జరుగుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజల కోసం దీదీ కష్టపడిన విధంగా మరే సీఎం పనిచేయలేదని మమతా బెనర్జీపై ప్రశంసల జల్లు కురిపించారు. ఎన్డీయేకు ఈ ఎన్నికల్లో కేవలం 150 నుంచి 175 స్థానాలు మాత్రమే లభిస్తాయని అన్నారు. ఇక పశ్చిమ బెంగాల్‌లోని 42 స్థానాలకు ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకూ ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనుంది.

ముంబై విమానాశ్రయంలో అక్రమంగా రూ.6.46 కోట్ల విలువైన బంగారం వజ్రాలు స్వాధీనం..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: మహారాష్ట్ర రాజధాని ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో అక్రమంగా తరలిస్తున్న రూ.6.46 కోట్ల విలువైన బంగారం, వజ్రాలను కస్టమ్స్ అధికారులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణికులు న్యూడుల్స్ ప్యాకెట్లు, లోదుస్తుల్లో బంగారం, వజ్రాలను తరలిస్తున్నారు. రూ.4.44 కోట్ల విలువైన 6.8 కిలోల బంగారం, రూ.2.02 కోట్ల విలువైన వజ్రాలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సదరు నలుగురు ప్రయాణికులను కస్టమ్స్ అధికారులను అరెస్ట్ చేశారు.

శ్రీలంక రాజధాని కొలంబో నుంచి ముంబైకి వచ్చిన ఒక విదేశీ ప్రయాణికుడిని తనిఖీ చేసినప్పుడు ఆయన లోదుస్తుల్లో బంగారం బార్లు దొరికాయి. దీని బరువు 321 గ్రాములు ఉంటుందని కస్టమ్స్ అధికారులు తెలిపారు.

INSV తారిణి భారత నావికాదళ మహిళా అధికారుల చారిత్రక ట్రాన్సోసియానిక్ యాత్ర తర్వాత తిరిగి విజయం సాధించింది

ఇండియన్ నేవల్ సెయిలింగ్ వెసెల్ తారిణి దాదాపు రెండు నెలల పాటు చారిత్రాత్మక సముద్రాంతర యాత్ర తర్వాత 21 ఏప్రిల్ 24న గోవాలోని తన బేస్ పోర్ట్‌కి తిరిగి వచ్చింది.

భారత నౌకాదళానికి చెందిన మహిళా అధికారులు లెఫ్టినెంట్ సీడీఆర్ దిల్నా కె మరియు లెఫ్టినెంట్ సీడీఆర్ రూపా ఈ యాత్రను డబుల్ హ్యాండ్ మోడ్‌లో చేపట్టారు. వారి అసాధారణ ప్రయాణం ఒక చారిత్రాత్మక మైలురాయిని సూచి స్తుంది, ఎందుకంటే వారు భారతదేశం నుండి అలాంటి ఘనతను సాధించిన మొదటి వ్యక్తిగా నిలిచారు.

ఈ యాత్రను 28 ఫిబ్రవరి 24న గోవా నుండి ప్రఖ్యాత సర్క్యుమ్ నేవిగేటర్ మరియు వారి మెంటర్ అటతీ అభిలాష్ టోమీ (రిటైర్డ్) ఫ్లాగ్ ఆఫ్ చేసారు. 22 రోజుల హిందూ మహాసముద్రంలోని అనూహ్య అంశాల గుండా నావిగేట్ చేసిన INSV తారిణి 21న మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు చేరుకుంది. 24. మారిషస్ కోస్ట్ గార్డ్ మరియు భారత హైకమిషన్‌కు చెందిన ప్రభుత్వ అధికారులతో అధికారులు సంభాషించే అధికారాన్ని కలిగి ఉన్న ఈ చారిత్రాత్మక ఘట్టం వరుస సంఘటనలతో జరుపుకుంది. స్నేహం మరియు సహకారం యొక్క సంజ్ఞలో, నౌక మారిషస్ కోస్ట్ గార్డ్ నుండి సిబ్బందితో శిక్షణా కార్యక్రమాన్ని కూడా చేపట్టింది, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేస్తుంది మరియు రెండు సముద్ర దేశాల మధ్య సద్భావనను పెంపొందించింది.

పోర్ట్ లూయిస్, లెఫ్టినెంట్ సిడిఆర్ దిల్నా కె మరియు లెఫ్టినెంట్ సిడిఆర్ రూప వద్ద తీవ్రమైన షెడ్యూల్ తరువాత, అధికారులు గోవాకు తిరుగు ప్రయాణంలో బయలుదేరడానికి సిద్ధమయ్యారు. 30 మార్చి 24న బయలుదేరిన అధికారులు, భారీ గాలులు, ప్రతికూల సముద్ర రాష్ట్రాలు మరియు సముద్రా లు అల్లకల్లోలంగా ఉండటంతో నిరంతర సవాళ్లను ఎదుర్కొన్నారు. 21 ఏప్రిల్ 24న INSV తారిణిని సురక్షితంగా తిరిగి గోవాకు తీసుకువెళ్లే లా వారి అణచివేత స్ఫూర్తి మరియు దృఢమైన సంకల్పం వారిని ముందుకు నడిపించింది.

వారి విజయాలు లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి మరియు సముద్ర డొమైన్‌లో మహిళలకు సాధికారత కల్పించడానికి భారత నౌకాదళం యొక్క నిబద్ధతను నొక్కి చెబుతున్నాయి. వారి సాహసయాత్రలో ఎదురైన సవాళ్లతో అధైర్యపడకుండా, అధికారులు సాహసం మరియు అన్వేషణ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ అసాధారణమైన నౌకరు మరియు స్థితిస్థాపకతను ప్రదర్శించారు.

ఈ ఏడాది సెప్టెంబరులో ప్రారంభం కానున్న ఎఐఒఎ తారిణిలో భూగోళ ప్రదక్షిణ (సాగర్ పరిక్రమ - యాత్ర) కోసం ఇద్దరు అధికారులు ఇప్పుడు తమ తదుపరి స్మారక యాత్రకు సిద్ధమయ్యారు.

ఈ విశేషమైన విజయం కేవలం స్ఫూర్తిని పొందడమే కాకుండా భవిష్యత్ తరాల సిబ్బందికి ప్రత్యేకించి భారత నౌకాదళంలో మహిళలకు సవాలుతో కూడిన సముద్ర సాహస కార్యకలాపాలకు స్వచ్ఛందంగా ముందుకు రావడానికి మార్గం సుగమం చేస్తుంది.

INS మండోవి యొక్క బోట్ పూల్ వద్ద కమాండింగ్ ఆఫీసర్ INS మండోవి మరియు నావల్ స్టేషన్ కమాండర్ నార్త్ గోవా ఎఐఒఎ తారిణిని జెండా ఊపి, స్టేషన్ మండోవి యొక్క నావికా సిబ్బంది మరియు కుటుంబాల సమక్షంలో, భారత నావికాదళంలో సామూహిక విజయానికి మరియు స్నేహానికి ప్రతీక.

ఢిల్లీలో ఒక్కసారిగా మారిన వాతావరణం.. బలమైన ఈదురుగాలులు, వర్షం.

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: దేశ రాజధాని ఢిల్లీలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం రోజంతా నిప్పులు చెరిగిన భానుడు సాయంత్రం మబ్బులు కమ్మడంతో కనుమరుగయ్యాడు. ఇంతలోనే ఈదురు గాలులు మొదలయ్యాయి. దాంతో భారీగా దుమ్ములేచింది. తర్వాత కాసేపటికే వర్షం మొదలైంది. అంతలోనే 40 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయి.

దాంతో రోజంతా ఉక్కపోతతో అల్లాడిన ఢిల్లీ వాసులకు సాయంత్రం ఉపశమనం లభించింది. వాతావరణం ఉన్నట్టుండి చల్లగా మారడంతో ఎంజాయ్ చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు నమోదు కాగా, సాయంత్రం వర్షం రాగానే 22.6 డిగ్రీలకు పడిపోయాయి.

4వేల పెన్షన్ ఏదీ?.. హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి: ఎమ్మెల్యే మల్లారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 23: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఎన్నో హామీలను ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత వాటిని అమలు చేయకుండా మరిచారని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన మహిళా సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ. 4 వేల పెన్షన్ ఇస్తామని.. ఇవ్వడం లేదని మండిపడ్డారు.

కల్యాణ లక్ష్మిలో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని ఇవ్వలేదన్నారు. నాలుగు వేల పెన్షన్ ఇవ్వడం దేవుడెరుగు, ఇచ్చే రెండు వేల కూడా పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో రెండు నెలల పెన్షన్ పెండింగ్‌లో ఉందని దుయ్యబట్టారు. 24గంటల కరెంట్ ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని, కరెంట్ రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారని మల్లారెడ్డి అన్నారు. సమావేశంలో బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, అనితాప్రభాకర్, లోక్‌నాథం, నళినికిరణ్, శ్యామ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ రూప, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద పెద్ద మాటలు మాట్లాడే సీఎం రేవంత్‌రెడ్డి కంటోన్మెంట్‌లో గద్దర్ బిడ్డకు టికెట్ ఇవ్వకుండా పూటకో పార్టీ మారే వ్యక్తికి టికెట్ ఇవ్వడం ఏమిటని కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. గద్దర్‌పై ఎనలేని అభిమానం చూపినట్లు నటిస్తూనే..ఆయన కూతురు వెన్నెలకు అవకాశం ఇవ్వకుండా.. మహిళలను కాంగ్రెస్ చులకనగా చేస్తున్నదని మండిపడ్డారు. నివేదితను ఎమ్మెల్యేగా, రాగిడి లక్ష్మా రెడ్డిని ఎంపీగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన దివంగత ఎమ్మెల్యే సాయన్నకు సొంత ఇల్లు కూడా లేదని, జీవితం మొత్తం ప్రజాసేవకే అంకితం చేశారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అనతి కాలంలోనే తండ్రిని, చెల్లిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నా.. ప్రజాసేవ చేసేందుకు ముందుకొచ్చిన నివేదితకు అండగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో అమలైన ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేస్తున్నదని, అలాంటి పార్టీకి ఓట్లు వేయొద్దని సూచించారు.

తనను ఆశీర్వదిస్తే, సేవకుడిగా ఉంటానని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు మాటలు చెప్పి ఓట్లు వేయించుకోవాలని చూస్తారని, అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

'తెలంగాణ కోసం కోట్లాడింది కేసీఆర్.. తెలంగాణ రాష్ట్రం సాధించింది కేసీఆర్.. ప్రాణాలు లెక్కచేయకుండా రాష్ట్రం సాధించిన నాయకుడిని మనం జీవితాంతం గుర్తుంచుకోవాలి' అని అన్నారు. కంటోన్మెంట్‌లో నివేదితను భారీ మెజార్టీతో గెలిపించుకోవడంతో పాటు మల్కాజిగిరి ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. కంటోన్మెంట్ అభివృద్ధిలో సాయన్న చేసిన పనులను ఎవరూ మర్చిపోరని గుర్తు చేశారు. హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత అన్నారు. త్వరలో జరిగే ఉప ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపిం చాలని విజ్ఞప్తి చేశారు. తండ్రి, చెల్లి మాదిరిగానే తనను ఆశీర్వదించాలని కోరారు. పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

నీట్ పరీక్షపై టీశాట్ స్పెషల్ లైవ్ లెసన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 23: జాతీయ స్థాయిలో మే నెల 5న నిర్వహించనున్న నీట్ పరీక్షపై టీ-సాట్ నెట్‌వర్క్ ఛానెల్స్ స్పెషల్ లైవ్ లెసన్స్ ప్రసారం చేస్తాయని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఇంటర్ పూర్తయ్యాక విద్యార్థులు డాక్టర్ కావాలనే ప్రత్యేక లక్ష్యంతో రాసే 'నీట్' పరీక్ష కోసం ఈ నెల 24 నుంచి అనుభవం కలిగిన ఫ్యాకల్టీతో సబ్జెక్టుల వారీగా స్పెషల్ లైవ్ అవగాహన పాఠ్యాంశాలు ప్రసారం చేస్తున్నట్లు తెలిపారు.

ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ (బాటనీ అండ్ జువాలజీ) సబ్జెక్టులకు సంబంధించి క్రాష్ట్ కోర్స్ రూపంలో 20 పాఠ్యాంశ భాగాలు ప్రసారం చేయనున్నామని పేర్కొన్నారు. లైవ్ ప్రసారాలు బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు కొనసాగనుండగా.. గురువారం ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు క్రాష్ కోర్స్ పాఠ్యాంశాలు ప్రసారం అవుతాయని సీఈవో తెలిపారు. నీట్ పరీక్ష రాసే విద్యార్థులు టీ-సాట్ కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సబ్జెక్ట్, పరీక్షపై సందేహాలు తలెత్తితే 040-23556037, టోల్ ఫ్రీ నంబర్ 1800 425 4039కు కాల్ చేయాలని సూచించారు.

ఉప్పల శ్రీనివాస్ గుప్తాతో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 23: నాగోల్ లోని తన నివాసానికి వచ్చి పార్లమెంట్ ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని తన గెలుపునకు కృషి చేయాలని భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాను కలిసి కోరారు. సానుకూలంగా స్పందించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా కచ్చితంగా తన మద్దతు ఉంటుందని, త్వరలోనే భువనగిరి పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో తట్టి అన్నారం మైసమ్మ టెంపుల్ చైర్మెన్ సుక్క శ్రీనివాస్, ఎల్బీ నగర్ డివిజన్ దళిత సంఘం అధ్యక్షులు జోగు రాములు, చిరంజీవి గౌడ్, భవాని గౌడ్, సాయి గౌడ్, మాల వెంకట స్వామి, ప్రవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంధం రాములు, కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ ప్రెసిడెంట్ శరత్ రెడ్డి, ఐవీఎఫ్ సికింద్రాబాద్ ప్రెసిడెంట్ బల్దే రవి కుమార్ గుప్తా, ఐవీఎఫ్ స్టేట్ అడిషనల్ సెక్రెటరీ కటకం శ్రీనివాస్ గుప్తా, ప్రభాకర్ గుప్తా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఈనెల 27 నుంచి టాటా ప్లే థియేటర్ లో మా రిటైర్ హోతీ హై

హైదరాబాద్, ఏప్రిల్ 23: ఈనెల 27 నుంచి టాటా ప్లే థియేటర్ లో మా రిటైర్ హోతీ హై చూడవచ్చు. బలహీనమైన, సాత్వికమైన వారు మహిళలు అనే మూస భావనలను బద్దలు కొట్టే కథను దక్షిణాది ప్రేక్షకులు మెచ్చుకుంటారని యతిన్ కార్యేకర్ చెబుతున్నారు. ఈ నటుడు మరాఠీ నాటక రచయిత అశోక్ పటోలే ప్రసిద్ధ నాటకం మా రిటైర్ హోతీ హై లో నటించారు. ఇది ఇప్పుడు కన్నడ, తెలుగులో కూడా ప్రసారం కానుంది. అశోక్ పటోలే క్లాసిక్ నాటకం మా రిటైర్ హోతీ హై ఒక మహోన్నత సాంఘిక నాటకం. ఇది మహిళలను గృహ విధులకు మాత్రమే ఎందుకు చేయాలి, వారి కుటుంబాలకు నిరంతరాయంగా సేవ చేయాలనే ఉద్దేశ్యం గురించి అడుగుతుంది. జీ థియేటర్ టెలిప్లే ఇప్పుడు కన్నడ, తెలుగులోకి దీనిని అనువదించబడినది.

ఈ టెలిప్లేలో నటించిన యతిన్ కార్యేకర్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఈ ప్లే విస్తృత ఆదరణ పొందుతుందని అభిప్రాయపడ్డారు. ఆయన మాట్లాడుతూ ఈ కథను దక్షిణాది ప్రేక్షకులు ఇష్టపడతారు ఎందుకంటే ఇది బలహీనమైన, సౌమ్యమైన, మానసికంగా ఆధారపడిన తల్లి మూస పద్ధతిని ఛేదిస్తుందన్నారు. మహిళలు తమ కోసం తాము నిలబడేలా ప్రోత్సహిస్తుందన్నారు. ఈ నాటకాన్ని కన్నడ, తెలుగు ప్రేక్షకులు బాగా ఆదరిస్తారని తాను నమ్ముతున్నానన్నారు. సుమన్ ముఖోపాధ్యాయ నిర్మాణంలో రంగస్థలానికి రాజన్ తమ్హానే దర్శకత్వం వహించబడిన మా రిటైర్ హోతీ హై లో సచిన్ దేశ్‌పాండే, శ్వేతా మెహెందలే, సంకేత్ ఫాటక్, మాన్సీ నాయక్, రుతుజా నాగ్వేకర్ కూడా నటించారు.

ఎన్నికల కురుక్షేత్రంలో నేను ఒక్కడినే -.జగన్

-కూటమి కుట్రలపై యుద్ధం
-అబద్ధాలు, మోసాలపైనే నా పోరాటం
-బాబు, దత్తపుత్రుడిని ఓడించడమే ధ్యేయం
-దగ్గరలోనే మన విజయం
-టీడీపీ దిగజారుడు తనంతోనే గీతాంజలి ఆత్మహత్య
-ఏపీకి డెస్టినీ విశాఖే.. ఇక్కడ సీఎం కూర్చుంటే ఐటీ రంగం పరుగులు
-హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతో మనమే పోటీ

అమరావతి, ఏప్రిల్ 23: ''మనం కూటమి కుట్రలు, కుతంత్రాలతో యుద్ధం చేస్తున్నాం. చంద్రబాబు, దత్తపుత్రుల కుట్రలతో పోరాటం చేస్తున్నాం. అబద్ధాలు, మోసాలతో యుద్ధం చేస్తున్నాం. నేను ఒక్కడిని ఒకవైపు.. చంద్రబాబు, దత్తపుత్రుడు, ఇతరులు మరోవైపు. ఒకే ఒక్కడిగా ఎన్నికల కురుక్షేత్రంలో దిగుతున్న. విజయానికి దగ్గరగా ఉన్నామనే.. మనపై దాడి తీవ్రతరం చేశారు.'' అని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఉద్వేగంగా ప్రసంగించారు. విశాఖపట్నంలో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , గీతాంజలిని దారుణంగా ట్రోల్ చేసి వేధించి ఆత్మహత్యకు పాల్పడేలా చేశారని, ఇది టీడీపీ దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. సోషల్ మీడియా మనతోనే ఉందని, సెల్ ఫోన్ ఉన్న ప్రతీ ఒక్కరు మనతోనే ఉన్నారని, దాడులకు భయపడేది లేదన్నారు. దేవుడు ఇంకా ఏదో పెద్ద స్క్రిప్ట్ ఏదో రాశాడని, 175కి 175 అసెంబ్లీ.. 25కి 25 లోక్ సభ సీట్లు గెలవబోతున్నామని సోషల్ మీడియా కార్యకర్తలతో సీఎం జగన్ అన్నారు. విశాఖపట్నం సిటీ ఏపీకి డెస్టినీ అవుతుందని, ఐటీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం వచ్చి నేరుగా విశాఖలో కూర్చుంటే బెంగుళూరు, హైదరాబాద్, చెన్నైతో పోటీ పడే స్థాయికి వెళ్తుందని వివరించారు.

"స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం కూడా చేశాం .. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీది రాజీలేని ధోరణి.. ప్రతిపక్ష పార్టీలన్నీ ఇప్పుడు జట్టుకట్టాయి, కూటమిగా ఏర్పడ్డాయి.. స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రతిపక్షాలు నైతికతను, విలువలను విడిచిపెట్టాయి.. స్టీల్ ప్లాంట్ విషయంలో వారి వైఖరి ఏంటో బయటపడిందని" సీఎం జగన్? దుయ్యబట్టారు. అనంతరం విశాఖపట్నం జిల్లా ఎండాడలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి నాయకులు కలిశారు. ఉక్కు కర్మాగార సమస్యను నివేదించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులతో సీఎం మట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు . శాశ్వతంగా ఇనుప ఖనిజం గనులు కేటాయింపుతో ప్లాంట్ పరిస్థితి మెరుగుపడుతుందని, విశాఖ స్టీల్ ప్లాంట్ పునర్ వైభవానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వంపై నిరంతరంగా ఒత్తిడి తీసుకు వస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో కార్మికుల మద్దతు కోరే నైతికత హక్కు కేవలం వైఎస్సార్సీపీకే ఉందని.. పార్టీ అభ్యర్థులకు అండగా నిలవాలని విశాఖ ఉక్కు కార్మికులను సీఎం వైఎస్ జగన్ కోరారు.

సీఎం వైఎస్ జగన్ సమక్షంలో బీజేపీ, టీడీపీ, జనసేన నుంచి వైసీపీలోకి పలువురు కీలక నేతలు చేరారు. ఎండాడ ఎంవీపీ సిటీ నైట్ స్టే పాయింట్ వద్ద గాజువాక నియోజకవర్గం బీజేపీ నుంచి మాజీ మేయర్ పులుసు జనార్దనరావు, 65వ వార్డు అధ్యక్షుడు వీఎస్ ప్రకాశవు, ఉపాధ్యక్షుడు కర్రి గోవింద్, కార్యదర్శి గొల్లపల్లి గోవింద్, వరప్రసాదరెడ్డి, సంపత్ కుమార్.. టీడీపీ నుంచి యువజన విభాగం నేత ఏఎన్ఆర్ చేరారు. పార్టీలో చేరిన నేతలకు కండువా కప్పి సీఎం జగన్ ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ పాల్గొన్నారు.

25,000కు పైగా యువతకు నైపుణ్యం పెంచే బహుళ-రాష్ట్ర కార్యక్రమాన్ని పూర్తి చేసిన హెచ్‌సీబీ

హైదరాబాద్, ఏప్రిల్ 23: భారతదేశంలోని ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీల్లో ఒకటైన హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ (హెచ్ సీసీబీ), 25,000కు పైగా యువతకు విక్రయాలు, మార్కెటింగ్ శిక్షణకు సంబంధించి తమ బహుళ-రాష్ట్ర అప్‌స్కిల్లింగ్ కార్యక్రమంను విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రకటించింది. వై4డీ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.

ఈసందర్భంగా హిందుస్థాన్ కోకా-కోలా బేవరేజెస్‌కి చెందిన చీఫ్ పబ్లిక్ అఫైర్స్, కమ్యూనికేషన్స్ అండ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ హిమాన్షు ప్రియదర్శి మాట్లాడుతూ పలు రాష్ట్రాల్లో 25,000 మంది యువతకు విక్రయాలు, మార్కెటింగ్‌లో నైపుణ్యాన్ని పెంపొందించాలనే తమ వ్యూహాత్మక కార్యక్రమానికి ఈ ప్రకటన ముగింపు అన్నారు.

మన కమ్యూనిటీల్లో అర్థవంతమైన సాధికారతను అందించాలనే తమ నిరంతర నిబద్ధతలో ప్రధాన భాగం ఈ ప్రయత్నమన్నారు. తాము ఈ మైలురాయిని చేరుకున్నప్పుడు, తమ దృష్టి సాంఘిక-ఆర్థిక సాధికారత కార్యక్రమాల్లో తదుపరి పెట్టుబడుల వైపు మళ్లుతుందన్నారు.

మహారాష్ట్ర నుండి ప్రోగ్రామ్ లబ్ధిదారుల్లో ఒకరైన దిపాలి సలుంఖే మాట్లాడుతూ.. తాను హెచ్ సీసీబీ సేల్స్ అండ్ మార్కెటింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకున్నప్పుడు, అది తన వృత్తిపరమైన ప్రయాణాన్ని మార్చివేసిందన్నారు. మరీముఖ్యంగా తాను ఈ రంగాల్లో విలువైన పరిజ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలను పొందినప్పుడు ఇది మరింతగా మారిందన్నారు. గుజరాత్‌కు చెందిన మరో లబ్ధిదారుడు చింటూ ఘెవరం ప్రజాపతి మాట్లాడుతూ తాను తన కుటుంబం ఆప్టికల్ వ్యాపారాన్ని సాంప్రదాయ పద్ధతిలో నడుపుతున్నానన్నారు. అది పెద్దగా లాభ సాటిగా లేకపోయిందన్నారు. ఈ ప్రోగ్రామ్ తర్వాత తాను డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియాను ఉపయోగించడం ప్రారంభించాను, ఇది మార్కెట్‌లో తమ వ్యాపారాన్ని బలోపేతం చేసిందన్నారు.

నీటి బొట్టుబొట్టును ఒడిసి పట్టాలి.. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతులు తప్పనిసరి: రోనాల్డ్ రాస్

హైదరాబాద్, ఏప్రిల్ 23: ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ తరాల అవసరాలకు ఉపయోగపడేలా ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టాలని బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్ అన్నారు. వర్షపు నీటిని ఏ మాత్రం వృథా చేయకుండా భూగర్భజలాలను పెంపొందించేలా ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని సంరక్షించుకోవడంతో పాటు వాటి ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించి.. భూగర్భ జలాలను పెంపొందించే దిశగా జీహెచ్ఎంసీ పరిధిలో చర్యలు చేపట్టాలన్నారు.

కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్లంబింగ్ వర్కర్లు, మేస్త్రీలకు నగరంలో నీటి సమస్యలు రాకుండా చూడటం, తగిన పరిష్కారం, వర్షపు నీటి సంరక్షించుకోవడం, భూగర్భ జలాలు పెరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. వర్షపు నీటిని నిల్వ చేయడానికి అందుబాటులోకి వచ్చిన వినూత్న విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఈపీటీఆర్ఐ కన్సల్టెంట్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రాజెక్టు సీఈవో కల్పనా రమేశ్ నీటి సంరక్షణ విధానాలపై అవగాహన కల్పించారు.

ఈ నెల 24, 25వ తేదీల్లో కూడా వర్షపు నీటి సంరక్షణపై ప్లంబింగ్ నిపుణులకు శిక్షణ నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు గూగుల్ ఫారం https://forms.gle/rJnheoVKSEU4VDnJA లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణానంతరం ప్లంబర్ వర్కర్లు, మేస్త్రీలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ (యూసీడీ) వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో భూగర్భ జలాల్ని పెంచేందుకు జలమండలి, ఈపీటీఆర్ఐ, జీహెచ్ఎంసీ సంయుక్తంగా చర్యలు చేపట్టాయి.

ఇందులో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్లంబర్స్, మేస్త్రీలకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని ఎండీ సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు.

మూడు రోజులు (22,23,24వ తేదీలు) ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వాననీటి సంరక్షణలో ఇంకుడు గుంతల నిర్మాణం ఎంతో ముఖ్యమని ఎండీ సుదర్శన్‌రెడ్డి అన్నారు,

ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు 86396 19366 ఫోన్ నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు.

అంబర్‌పేట ఫ్లై ఓవర్ ఎందుకు పూర్తి కాలేదు: పద్మారావుగౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 23: ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 22: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశం మొత్తం చూపు సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం వైపే ఉన్నదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చని కిషన్‌రెడ్డి ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఐదేండ్లలో పూర్తి చేస్తానన్న అంబర్‌పేట ఫ్లై ఓవర్ పనులు నేటికీ ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బూత్ కమిటీల ప్రతినిధుల సమావేశాన్ని బౌద్ధనగర్ డివిజన్‌లోని రాఘవ గార్డెన్స్‌లో నిర్వహించారు.

ముఖ్య అతిథిగా హాజరైన పద్మారావుగౌడ్ మాట్లాడుతూ ఈ ఐదేండ్లలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి దానం నాగేందర్ వెళ్తారని దుయ్యబట్టారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడే రాజీవ్‌సాగర్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి కవాడిగూడ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నేరుగా ఓటర్లను కలిసి.. ఢిల్లీలో తెలంగాణ వాణి వినిపించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు.

విద్యార్థులకు అబాకస్ సర్టిఫికెట్ల ప్రధానం

కరీంనగర్,ఏప్రిల్ 23 (నేటినిజం ప్రతినిధి) నగరంలోని మారుతీ నగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల రిషి ద ప్లే స్కూల్లో మంగళవారం పాఠశాల అకాడమిక్ ఇయర్ చివరి రోజున అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు అబాకస్ సర్టిఫికెట్లను రిషి విద్యా సంస్థల చైర్మన్ కామారపు చెన్నప్ప ప్రధానం చేశారు. గత నెలలో అబాకస్ సంస్థ వారు నిర్వహించిన గణితం టాలెంట్ టెస్ట్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ సర్టిఫికెట్లను ప్రధానం చేసినట్లు చైర్మన్ చెన్నప్ప తెలిపారు. విద్యార్థులకు మేధాశక్తులు పెంచేందుకు అబాకస్ లాంటి సంస్థలు నిర్వహించే పరీక్షలు దోహదపడతాయన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ కామారపు కౌశల్, అడ్మిన్ రజిత, మహిళా టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా 'చెల్మెడ' జన్మదిన వేడుకలు

-రాజన్నకు కోడె మొక్కు చెల్లించిన బీఆర్ఎస్ శ్రేణులు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 23: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ చల్మెడ లక్ష్మీ నరసింహారావు 62వ జన్మదిన వేడుకలను పట్టణ పార్టీ శ్రేణులు ఘనంగా జరిపారు. జిల్లా జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ-రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ముందుగా రాజన్న సన్నిధిలో స్వామివారికి కోడె మొక్కు చెల్లించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. చల్మెడ లక్ష్మీనరసింహారావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ రాజన్నను వేడుకుంటున్నామని తెలిపారు. అనంతరం చల్మెడ స్వగృహంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, సిరిగిరి రామచందర్, నరాల శేఖర్, గోలి మహేష్, జోగిని శంకర్, పట్టణ సీనియర్ నాయకులు మాదాడి గజానందరావు, పొలాస నరేందర్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, జీవన్ గౌడ్, లైసెట్టి మల్లేశం, పాషా, నాయకులు వెంకట్ రెడ్డి, పోతూ అనిల్ కుమార్, దుర్గం మహేష్, గజ్జల రమేష్, హింగే కుమార్, దమ్మ భాస్కర్, మైలారపు రాము, మంతే సందీప్, తీగల హరీష్ గౌడ్, జేపీ రావు, రాకేష్, మహేందర్, చిన్న జడల శీను, అంబటి సంతోష్, రాజేశం గౌడ్, రవిచంద్ర గౌడ్, అక్రమ పాషా, అప్పర్, ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు గోస్కుల రవి, బియ్యాల ప్రమోద్, పార్వతి మహేష్, బాలకిషన్, దేవరాజు, తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులకు పండ్లు పంపిణీ

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 23: (నేటినిజం ప్రతినిధి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంలో చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ జయంతి వేడుకల సందర్భంగా హనుమాన్ దీక్షపరులతో పాటు సాధారణ భక్తులు రాజన్న దర్శనానికి వస్తున్నారు. వచ్చిన భక్తులకు ఆలయం పరిసరాల ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులకు పళ్ల పంపిణి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ మాట్లాడుతూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. పండ్లు అందించడం పట్ల హనుమాన్ భక్తులుసంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పులి రాం బాబు, ముప్పిడి శ్రీధర్, దూలం భూమేష్ గౌడ్, కూరగాయలు శేకర్ ఉన్నారు.

అంజన్న సేవలో మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 23: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం శ్రీ జోధాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం స్వామివారి కళ్యాణం నిర్వహించడం సంతోషకరమన్నారు. స్వామి వారి దీవెనలు ప్రజలదరిపై ఉండాలని, పాడి పంటలు పంటలు సక్రమంగా పండి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నారు. మంత్రి, ప్రభుత్వ విప్ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పిల్లి కనకయ్య, గాలి పెల్లి స్వామి గౌడ్, ఎర్రం రాజు, దండుగుల తిరుపతి తదితరులు ఉన్నారు

భారత్ ఏదో ఒక వర్గానికి చెందినది కాదు

-మతం, భాష, దుస్తుల కోడ్‌లో ఏకరూపత సాధ్యం కాదు

-జెఎన్‌యు విసి శాంతిశ్రీ పండిట్

న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : మతం, భాష, దుస్తుల కోడ్‌లో ఏకరూపత భారత్‌లో సాధ్యం కాదు అని, దేశం ఏదో ఒక వర్గానికి చెందినది కాకపోవడమే ఇందుకు కారణం అని జెఎన్‌యు వైస్ చాన్స్లర్ శాంతిశ్రీ పండిట్ అన్నారు. ఢిల్లీలో పిటిఐ వార్తా సంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఎడిటర్లతో పండిట్ ముఖాముఖి సాగిస్తూ, విద్యా సంస్థలు వ్యక్తిగత నిర్ణయాలను మన్నించాలని, హిజాబ్‌ను ధరించాల నుకునేవారిని అలా చేయనివ్వాలని సూచించారు. 'మతంలో గాని, జాతిలో గాని, భాషలో గాని ఏకరూపతను అంగీకరించను. ఏదో ఒక భాషను అందరిపై రుద్దరాదు.

కొన్ని రాష్ట్రాల్లో కొందరు దానిని (అధికార భాషను) హిందీకి మార్చాలని కోరుకుంటే వారు చేయవచ్చు. అయితే, దక్షిణాదిలో అది కష్టం. తూర్పు భారతదేశంలోనూ, తుదకు మహారాష్ట్రలోనూ హిందీని అంగీకరిస్తారని అనుకోను' అని ఆమె చెప్పారు. 'హిందీ ఉండవచ్చు కానీ ఒక్క భాషను అందరిపై రుద్దరాదని అంటాను. (జవహర్‌లాల్) నెహ్రూ, ఇందిరా గాంధీ ఇద్దరూ త్రిభాషా సూత్రం గురించి మాట్లాడేంత మూర్ఖులు కారు. ఎందుకంటే భారత్లో ఏకరూపత ఏవిధంగాను పని చేయదు' అని పండిట్ అన్నారు.

జాతీయ భాషగా, బోధన, నేర్చుకోవడంలో ప్రధాన బోధన మీడియాల్లో ఒకటిగా హిందీ కోసం పట్టుబట్టడంపై ప్రశ్నకు విసి ఆ విధంగా సమాధానం ఇచ్చారు. 'భాష సున్నితమైన అంశం. ఆ విషయంలో ఎవరైనా జాగ్రత్తగా వ్యవహరించాలి. మీరు నన్ను అడిగినట్లయితే, ఒక్క భాషే ఉండాలనడంలో మీరు నింపాదిగా వ్యవహరించాలని అంటాను' అని ఆమె చెప్పారు. ఒకే ఉనికి, మతం దేశంలో పనిచేయవని కూడా పండిట్ అన్నారు. విద్యా సంస్థల్లో దుస్తుల నియమావళి గురించి మీ అభిప్రాయాలు ఏమిటన్న ప్రశ్నకు పండిట్ సమాధానం ఇస్తూ, అది వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

కాసానిని గెలిపించుకుందాం :ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 23: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అంతారం నరేశ్ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి.. ఓట్లు అభ్యర్థించాలని శ్రేణులకు సూచించారు.

మైలార్‌దేవ్‌పల్లిలో ఎన్నికల ప్రచార వాహనాలను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. కాగా, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మంగళవారం రాజేందర్‌నగర్ తహసీల్దార్ కార్యాయలంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. బడుగుల గొంతుక కాసానిని ఆశీర్వదించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

ఉప్పల్‌లో ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్.. మెట్రో సమయం పొడిగింపు..

హైదరాబాద్, ఏప్రిల్ 23: హైదరాబాద్ వాసులకు గుడ్ న్యూస్. ముఖ్యంగా మెట్రోలో ప్రయాణించే వారు తప్పక తెలుకోవాల్సిన విషయం.

హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం వేదికగా ఈ నెల 25వ తేదీన ఐపీఎల్ మ్యాచ్ జరగనుంది. ఉప్పల్ మైదానంలో రాయల్ ఛాలెంజర్ బెంగళూరు ? సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. గురువారం రాత్రి 7:30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా హైదరాబాద్ మెట్రో కీలక నిర్ణయం తీసుకుంది.

ఉప్పల్ మార్గంలో మెట్రో రైలు సమయం పొడిగించారు. ఆ రోజు మెట్రో రైలు సేవల సమయం పొడిగించారు. నాగోల్, ఉప్పల్ స్టేడియం, ఎన్‌జీఆర్ఐ స్టేషన్‌లలో చివరి రైళ్లు రాత్రి 12:15 గంటలకు బయల్దేరి 1:10 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయని మెట్రో అధికారులు వెల్లడించారు. ఐపీఎల్ సమయంలో సాధారణంగా ఎప్పుడు ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ ఉన్నా.. హైదరాబాద్ మెట్రో ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకుంటున్న విషయం తెలిసిందే.

పట్టాదారు పాసుపుస్తకంపై జగన్ బొమ్మ దేనికి?

- తాడేపల్లిలో కూర్చొని మీ తలరాతలు రాస్తాడా!

-'ప్రజాగళం'లో భాగంగా పాతపట్నం భారీ బహిరంగ సభలో నిలదీసిన చంద్రబాబు

శ్రీకాకుళం ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: పట్టాదారు పాసుపుస్తకంపై జగన్ బొమ్మ దేనికి? అని తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. తాడేపల్లిలో కూర్చొని మీ తలరాతలు రాస్తాడా అని నిలదీశారు. .'ప్రజాగళం'లో భాగంగా పాతపట్నం భారీ బహిరంగ సభలో సీఎం జగన్, వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్‌కు ఇదే చివరి ఛాన్స్ కావాలన్నారు. తనకు రాజకీయాలు కొత్త కాదని చెప్పారు. రాష్ట్రం గాడి తప్పిందని.. .రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. జగన్ పాలనలో విద్యుత్ చార్జీలు పెరిగాయని మండిపడ్డారు. మద్యపాన నిషేధం అన్నారని..నాసిరకం మద్యం అమ్మకాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో జే.టాక్స్. గంజాయి సరఫరా పెరిగిపోయిందని ఆరోపించారు. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి అమ్మితే కఠిన చర్యలు తీసపుకుం టానని వార్నింగ్ ఇచ్చారు. జాబు కావాలంటే బాబు రావాలని అది తన బ్రాండ్ అని... గంజాయి కావాలంటే జగన్ రావాలి...అది ఆయన బ్రాండ్ అని చంద్రబాబు సెటైర్లు గుప్పించారు.

విజయ లక్ష్మి వెంకటేశ పుస్తక ఆవిష్కరణ

హైదరాబాద్ ఏప్రిల్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నగరం లోని రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ కవుల సంఘం మరియు కళా సూర్య కల్చరల్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి కవిసమ్మేళనం మరియు డా.జనువాడ రామస్వామి రచించిన విజయలక్ష్మి వెంకటేశ శతక పద్య పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం తెలంగాణా రచయితల సంఘం అధ్యక్షులు సుతారపు వెంకట నారాయణ అధ్యక్షతన ఘణంగా నిర్వహించటం జరిగింది .కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ఉపన్యమిస్తూ తెలంగాణ ప్రాంతంలో గద్య మరియు పద్య ప్రక్రియలలో అనేక రచనలు కొనసాగుతున్నాయని డా.జనువాడ రామస్వామి విజయ లక్ష్మి వేంకటేశ్వర శతకం ఉన్నత లక్షణాలతో రచింప బడిన పద్యపుస్తకమంటూ రచయితను అభినందించారు. పుస్తక ఆవిష్కరణ చేసిన పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ జనువాడ రామస్వామి రచనలలో మనవతా విలువలు ఆధ్యాత్మిక జీవన విష యాలు అనేకం ఉన్నాయని కవిని అభినందించారు .ప్రముఖ సాహితీ వేత్తలు సుధామ విహారి గిరిజా మనోహర్ డా.జనువాడ రచనల విశిష్టతలను వివరించారు .కార్యక్రమానికి అనుముల ప్రభాకరా చారి ఆహ్వానం పలుకగా దొంతరబలోయిన దైవాదీనం వందన సమర్పణ చేశారు .తెలంగాణ కవుల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ నాగేశ్వర్ రావ్ కొమ్ము విజయలక్ష్మి తో పాటు తెలంగాణ ప్రాంత వివిధ జిల్లాల ప్రముఖ కవులు కవయిత్రులు డా.పాండాల మహేశ్వర్ బొద్దోజు మల్లికార్జున్ పెరిమి సత్యమూర్తి మిద్దె సురేష్ తగుళ్ల గోపాల్ బాల గంగాధరయ్య కర్నాటి రాములు గౌడ్ పోచం లక్ష్మి నర్సయ్య విజయలక్ష్మి కొండా రవీందర్ కవిత పున్న విజయ లక్ష్మి గాజుల మధులత రాఘవాచార్యులు ఆరవ రవీంద్ర శ్రీనివాస రావ్ ప్రవీణ్ కుమార్ అబ్దుల్ షాహిద్ తదితరులు కవితా గానం చేసారు. ఈ కార్యక్రమంలో కామన్ దయాస్ సంస్థ నిర్వాహకులు తంగెళ్ల కనకా చారీ, సరస్వతి, వనం మధు తదితర కవులూ కవయిత్రులను ఘణంగా సన్మానించారు.

ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

-మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 23: ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం ఇంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని చేవెళ్ల పట్టణంలోని అయన విగ్రహానికి, కౌకుంట్లలోని సమాధి వద్ద ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంద్రారెడ్డి కుమారులు కార్తిక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, రంగారెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ ఇంద్రారెడ్డి అందరి నుంచి దూరమై 23 ఏండ్లు కావొస్తున్నా ఇంకా ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇంద్రన్న కల, రాష్ట్రం ఏర్పడి మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో సుపరిపాలన కొనసాగిందన్నారు. ఇంద్రన్న అడుగుజాడల్లో నడుస్తూ ఆయన అశయ సాధనకు కృషి చేస్తామన్నారు.

ఎదురుగట్లలో ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం

-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 23: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ కు ఆలయ అర్చకులు బాజ భజంత్రీలు మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ, హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామివారి ఆలయం మన ప్రాంతంలోనే అతి పురాతనమైన ఆలయంగా వెలుగొందుతుందన్నారు. మన హైందవ మతం అనుసరించి మన తాత ముత్తాతల నుండి గ్రామాల్లో దేవాలయాలు నిర్మిస్తూ స్వామివారిని దర్శించుకుంటూ కళ్యాణ మహోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. శ్రీ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉంటూ, ఎలాంటి కీడు లేకుండా అందరూ బాగుండాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి చిత్రపటం బహుకరించి ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడదాం

-భవిష్యత్ కోసం కంకణబద్ధులై పనిచేద్దాం

-బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో

-ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



హైదరాబాద్, ఏప్రిల్ 23: మన పార్టీ, మన అభ్యర్థి, మన భవిష్యత్ కోసం పోరు చేయాల్సిన అవసరమున్నదని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని సీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికలు బీఆర్ఎస్ కార్యకర్తల భవిష్యత్‌కు ఎంతో ముఖ్యమన్నారు. 20 రోజులు మన పార్టీ, మన అభ్యర్థి, మన భవిష్యత్ కోసం కంకణబద్ధులై పని చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోలేదని, కొన్ని ప్రాంతాల్లో చిన్నచిన్న కారణాలతో మాత్రమే మనం అధికారంలోకి రాలేకపోయామన్నారు.

శ్రేణులంతా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూనే.. కాంగ్రెస్ పార్టీ చెప్పిన దొంగమాటలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. గ్రామ గ్రామానా రచ్చబండలు, చౌరస్తాలు, కూడళ్ల వద్ద చర్చలు పెట్టాలన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను వివరించి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరమున్నదన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన ఏ పని చేయలేకపోయిందని ధ్వజమెత్తారు. విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు, స్కూటీలు వంటివి మహిళల కోసం కురిపించిన వరాల జల్లులు ఏమయ్యాయని ప్రశ్నించారు. హామీలను నెరవేర్చడంలో ఎవరైనా అడ్డుపడ్డారా అని ప్రశ్నించారు. దొంగమాటలు చెప్పుకుంటూ.. పబ్బం గడిపుకోవడం మానేసి చిత్తశుద్ధితో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభ ఉంటుందని ఎమ్మెల్యే మల్లారెడ్డి వెల్లడించారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. 'రాజకీయ పునర్ జన్మ నిచ్చిన మల్కాజిగిరినే మరిచిపోయిన చరిత్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది. మల్కాజిగిరి ఎంపీగా గెలిచి ప్రజలను ఒక్కరోజైనా పలకరించిన పాపన పోలేదు. రేవంత్‌రెడ్డికి కొడంగల్‌లో ఘోర పరాభవం తర్వాత రాజకీయ పునర్ జన్మనిచ్చింది మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజలే. కానీ రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ప్రాంతానికి చేసిన ఒక్క పనినైనా ఉందా..? ముఖ్యమంత్రి కాగానే కొడంగల్‌కు రూ.3500 కోట్లు మంజూరు చేసుకున్నారు. మల్కాజిగిరి ప్రాంతం, ప్రజలు కనిపించకపోవడం సిగ్గుచేటు'. అని రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.